
వార్త
ఆదివారం
28 మే, 2023
తెలుగు కీర్తి బావుటా
ఎన్టీఆర్

## తారాతీరం



# పవన్, సాయిధరమ్‌ల చిత్రం 'బ్రో'

**పవర్‌స్టార్** పవన్ కళ్యాణ్, మెగా సుప్రీం హీరో సాయిధరమ్ తేజ్‌లు కథానాయకులుగా నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'బ్రో ది అవతార్'. అయితే సముద్రఖని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పవన్ పోర్షన్ పూర్తయినట్లు తెలుస్తోంది. మొదట్లో ఇదొక తమిళ సినిమాకు రీమేక్ అని నిరుత్సాహపడిన అభిమానులు ఇప్పుడు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు, స్క్రీన్ ప్లే త్రివిక్రమ్ అందిస్తుండగా ప్రియా ప్రకాష్ వారియర్, కేతిక శర్మలు నటిస్తున్నారు. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి.



# 'దృశ్యం' సినిమా కొరియన్ భాషలో రీమేక్?

**జీతూ జోసెఫ్** దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన మలయాళ చిత్రం 'దృశ్యం' మాలీవుడ్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌లలో ఒకటి. ఈ చిత్రం తరువాత అనేక భాషలలోకి రీమేక్ అయ్యింది. రీమేక్ వెర్షన్లు కూడా సూపర్ హిట్ అయ్యాయి. 'దృశ్యం 2' కూడా తెరకెక్కింది. అంతేకాక ఇది నేరుగా ప్రైమ్ వీడియోలో విడుదలైంది. సీక్వెల్ సైతం పలు భాషల్లో రీమేక్ చేయబడింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఇప్పుడు కొరియన్ భాషలో రీమేక్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని పనోరమా స్టూడియోస్, కొరియన్ నిర్మాణ సంస్థ అంథాలజీ స్టూడియోస్ నిర్మించనున్నాయి. భారతీయ నిర్మాణ సంస్థ కొరియన్ స్టూడియోతో సినిమా కోసం సహకరించడం ఇదే మొదటి సారి. ఇండియన్ బ్లాక్ బస్టర్ చిత్రం కొరియన్ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి మరి. ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలో తెలియనున్నాయి.

ఆదివారం వార్త
28 మే, 2023

## మంచి ముత్యాలు

మనసును చలింపచేసే అన్ని అవలక్షణాలను
మనం ఎప్పుడు దూరం చేస్తామో,
అప్పుడు సంతోషాన్ని సొంతం చేసుకోగలం.

- అనుభవానంద స్వాములు

## విషయ విశేషం


పాన్ రుచి చూద్దామా!... 4

'సంఘీ'భావం....5

రసాయనాలతో విషతుల్యంగా పండ్లు

కవర్ స్టోరీ..6

తెలుగు కీర్తి బావుటా

ఎన్టీఆర్

ఈవారం కవిత్వం..12

ఎక్కణ్నుంచో ఈ దరికి..

ప్రాణాలు పీల్చేస్తున్న పొగాకు..14

కథ.. 20

మాలతి అక్కయ్య

ఆగ్నేయంలో మెట్ల నిర్మాణం.....24

సాహిత్యం....25

నండూరి వారి 'యెంకి'

అదేదో సామెత చెప్పినట్టు....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## భవిష్యత్ విమానం



ప్రయాణికులను కోరుకున్న అత్యంత వేగంగా చేరవేయడంలో విమానాలకు సాటి వచ్చే వాహనాలేవీ ఇంతవరకు లేవు. తొలితరం విమానాలతో పోలిస్తే, సూపర్ సోనిక్ విమానాలు ధ్వనిని మించిన వేగంతో ప్రయాణిస్తాయనే సంగతి తెలిసిందే! త్వరలోనే హైపర్ సోనిక్ విమానం కూడా అందుబాటులోకి రానుంది. ఇది ఏకంగా ధ్వనికి ఐదురెట్ల వేగంతో ప్రయాణించగలదని దీనిని రూపొందించిన స్విస్ స్టార్టప్ కంపెనీ 'డెస్టినస్' చెబుతోంది. ఇది పూర్తిగా హైడ్రోజన్ ఇంధనంతో పనిచేస్తుంది. ఈ విమానం సిడ్నీ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు కేవలం నాలుగు గంటల పదిహేను నిమిషాల్లోనే చేరుకోగలదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న విమానాల ద్వారా సిడ్నీ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకోవడానికి కనీసం ఇరవైగంటలు పడుతుంది. ఈ కొత్త హైపర్ సోనిక్ విమానం అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుంది. ఈ విమాన సేవలు 2030 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

### ఫైరింజన్ ఇల్లు

ఇది ఫైరింజిన్‌గా ఒకప్పుడు పూర్తికాలం సేవలందించిన వాహనమే. పాతబడిపోవడంతో దీనిని ఇప్పుడు ఇల్లులా మార్చేశారు. ఈ ఫైరింజిన్ ఇంటిని పర్యాటకులకు అద్దెకిస్తున్నారు. బ్రిటన్‌లోని లేక డిస్ట్రిక్ట్ నేషనల్ పార్కు సమీపంలోకి బ్లెంకాత్రా ప్రాంతంలో దీనిని నిలిపి ఉంచారు. ఇందులో బస చేయదలచుకున్న వారు అక్కడకు వెళ్లాల్సిందే. ఇందులో చాలా విశేషాలే ఉన్నాయి. పాతబడిన ఈ ఫైరింజన్‌ను రెండంతస్తుల ఇల్లులా మార్చేశారు. ఇందులో రెండు బెడ్‌రూమ్స్, లివింగ్‌రూమ్, స్మార్ట్ టీవీ, కిచెన్, బాత్‌రూమ్ వంటివన్నీ ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయడం విశేషం. ఒక అంతస్తు నుంచి మరో అంతస్తుకు రాకపోకలు జరపడానికి వీలుగా నిచ్చెనను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో బస చేయాలంటే వారానికి 399 పౌండ్లు అంటే 40.940 చెల్లించాల్సి ఉంటుంది.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# పాన్ రుచి చూద్దామా!









**అనేక ఆరోగ్య** ప్రయోజనాలున్న తమలపాకులో రకరకాల దినుసులను దట్టించి పొట్లంలా చుడతారు కాబట్టి మనోళ్లు 'పాన్' అని పేరు పెట్టారు. పాన్ అనగానే చాలామందికి కలకత్తా, స్వీట్, బాబా కశ్మీరీ, నవరతన్, మీనాక్షి ఇలా ఓ పదీఇరవై గుర్తొస్తాయి. కానీ పాన్‌లలో వందల రకాలున్నాయి. అవేంటో గమనిద్దాం.

## మహారాష్ట్ర కపుల్ పాన్ ఫేమస్

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో తారా పాన్‌షాప్‌లో దొరికే 'కపుల్ పాన్' చాలా ఫేమస్. దూరప్రాంతాల నుంచి వచ్చి మరీ ఎన్నో జంటలు రుచి చూసి వెళ్తాయి. స్థానికులు శోభనం రోజున ప్రత్యేకంగా ఆర్డర్ చేస్తారు. ఈ సెట్‌లో రెండు కిళ్లీలు ఉంటాయి. ఎవరిది వారు తినేయడం కాదు. ఒకరు మరొకరికి ఇచ్చుకోవాలి. బెంగళూరులోని ఫ్రేజర్ టౌన్‌లో ఓ అన్నదమ్ములు ఓ పాన్ స్టూడియోను నడుపుతున్నారు. వీరి దగ్గర 150 రకాల పాన్‌లు దొరుకుతాయి. చాక్లెట్, కాఫీ, కేసరి, పుదీనా ఇలా వంద ఫ్లేవర్డ్ పాన్‌లను అందిస్తున్నారు మతీన్ బ్రదర్స్. దేని రుచి దానిదే. వరుసబెట్టి ఓ అరడజను లాగించొచ్చు.



## నాసిక్‌లో ఆరువందల రకాలు

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆరొందల రకాల పాన్‌లు లభిస్తాయి. ఈ దుకాణం ఏర్పాటే ఓ సక్సెస్ స్టోరీ. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం లభించక పోవడంతో గణేష్ దుర్క్రే అనే పట్టభద్రుడు పుణె వెళ్లి ఓ పాన్‌షాప్‌లో పనికి కుదిరాడు. ఆ సమయంలో పాన్ తయారీ విధానంపై అవగాహన పెంచుకున్నాడు. సొంతూరికి వచ్చేసి పాన్‌డబ్బా పెట్టుకున్నాడు. అందులోనే తన ప్రత్యేకత చాటాడు. దాదాపు 600 రకాల పాన్‌లు కడుతున్నాడు. ఐస్‌క్రీమ్ పాన్, జీలీపాన్, ఫ్రూట్‌పాన్, లిక్విడ్‌పాన్, పాన్ ముజీదే, పాన్‌షాట్, ఆయుర్వేదిక్ పాన్, స్వీట్‌పాన్, పాన్ ముజీదే, పాన్‌షాట్, స్వీట్‌పాన్, మగాయిపాన్, గుల్‌కండ్ పాన్ ఇలా చాలానే ఉన్నాయి. కొన్ని పాన్ ధర లక్షపైమాటే ఉంటుంది. బెంగళూరులోని కోరమంగల్ ఎంపైర్ రెస్టారెంట్‌లో ఓ పాన్‌షాపు ఉంది. ఇక్కడ 132 రకాల పాన్‌లు దొరుకుతాయి. నోటిని తియ్యగా మార్చే స్వీట్‌పాన్ నుంచి భగభగమండే ఫైర్ పాన్ వరకూ అనేక రుచులు. ఢిల్లీలోని అమర్ కాలనీలో 'షాన్ ఎ పాన్' ఎప్పుడూ కస్టమర్స్‌తో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక్కడ పొగాకు ఉత్పత్తులు వాడని 51 రకాల పాన్‌లు తయారు చేస్తారు. కివీ పాన్, కాఫీ పాన్, పటాకాపాన్, కుకీస్‌పాన్, కాటన్ క్యాండీపాన్, కొకొనట్‌పాన్ ఇలా ఆరోగ్యానికి హానికలిగించని పాన్‌షాప్ కేరాఫ్ అడ్రస్. యమూస్ పంచాయత్‌లో డ్రైఫ్రూట్స్‌తో కట్టిన పాన్‌ను బంగారం కోటింగ్ వేసిన పేపర్‌లో చుట్టి ఇస్తారు.





# 'సంఘీ' భావం



# రసాయనాలతో విషతుల్యంగా పండ్లు

**గతంలో** అనారోగ్యం బారిన పడినా, నీరసంగా అనిపించినా పెద్దలు ఇచ్చే సలహా తాజా పండ్లు తిని, పాలు తాగమని చెప్పే వారు. ఇప్పుడు దానికి విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. ఏ పండు తిన్నా అనారోగ్యాన్ని కొనితెచ్చుకునే దురవస్థ ఎదురౌతోంది. పండ్లు ఆకర్షణీయంగా కనిపించేందుకు, త్వరగా మగ్గపెట్టేందుకు ఇష్టారాజ్యంగా రసాయనాలను ఉపమోగిస్తున్నారు. యాపిల్ పండ్లు, మామిడి పండ్లు, బొప్పాయి, పైనాపిల్ వంటి అనేక పండ్లు రసాయనాలతో నిండి విషతుల్యంగా మారుతున్నాయి. చెట్టుపై కాయలు పండ్ల దశకు వచ్చిన తరువాత వాటిని దింపి భుజిస్తే ఆరోగ్యం వస్తుంది. అయితే పచ్చిగా ఉన్న వాటిని దింపి వాటిలో కార్బైడ్ వంటి రసాయనాలను ఉంచితే పైకి మగ్గినట్లు కనిపిస్తాయి. లోపల గట్టిగా, చేదుగా ఉంటాయి. రుచిలోనే వ్యత్యాసం ఉందంటే సరిపెట్టుకోవచ్చు. పండుపై రసాయనాల ప్రభావం ఉండటంతో శరీరంలో అనేక రుగ్మతలకు దారితీస్తుంది. కేన్సర్, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు దెబ్బతినడం వంటి అనేక రోగాలు పట్టుకుంటాయి. పాలలో గతంలో కేవలం నీరు మాత్రమే కలిపి కల్తీ చేసేవారు. ప్రస్తుతం పశువుల నుంచి ఎక్కువ మోతాదులో పాలను సేకరించేందుకు వీలుగా ఈస్ట్రోజన్ ఇంజక్షన్‌ను ఇస్తున్నారు. దీని ప్రభావంతో ఆరు లీటర్ల పాలు ఇచ్చే పశువునుంచి 8 నుంచి పది లీటర్లు పొందే అవకాశం ఉంటుంది. చాలా ప్రాంతాల్లో మన ముందే పాలను పితికి ఇస్తారు. అయితే అప్పటికే ఆ పాలలో ఈస్ట్రోజన్ పార్టికల్స్ ఉండటంతో అవి పాలతో పాటు మన శరీరం లోకి ప్రవేశిస్తాయి. ఇది మహిళల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. బహిష్టు సమయంలో మార్పులు వస్తాయి. కడుపులో మహిళలకు ఉండే పునరుత్పత్తి భాగాలను ఈ పాలు దెబ్బతీస్తాయి. దీనితో పిల్లలు జన్మనిచ్చే అవకాశాన్ని కోల్పోతారు. శరీరంలో కూడా అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. పాల ప్యాకెట్ల ద్వారా లభించే పాలలో మరిన్ని చెడు పదార్థాలను కలుపుతారు. పాలు త్వరగా పాడైపోతాయి. అలా కాకుండా ఉండేందుకు మృతదేహాలు కుళ్లిపోకుండా మార్చురీల్లో ఉపయోగించే రసాయన ద్రవాన్ని కలుపుతారు. దీనితో రెండు మూడు రోజులైనా పాలు విరిగిపోకుండా ఉంటాయి. అయితే దీనివల్ల నరాల వ్యవస్థ దెబ్బతింటుంది. ఇక బయట విక్రయించే పెరుగు గట్టిగా ఉండటానికి పేపర్లు, ఇతర పదార్థాలను ఉపయోగిస్తారు. మామిడి పండ్ల బుట్టలో కార్బైడ్‌ను ఉంచుతారు. ఆ ప్రభావంతో ఇవి 24 గంటలో మగ్గిపోయి నిగనిగలాడుతుంటాయి. అయితే లోపలి భాగం మాత్రం పచ్చిగానే ఉంటుంది. కార్బైడ్ ప్రభావం 24 గంటల తరువాత చూపిస్తుందని, తాజాగా కొత్త రసాయనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. నీటిలో కలిపి మామిడి పండ్లపై ఈ రసాయనాన్ని జల్లితే కేవలం గంట వ్యవధిలోనే పండుపై తొక్క పండిపోతుంది. యాపిల్ పండ్లపై మైనం పూయడంతో పాటు చాలాకాలం వరకు చెడిపోకుండా ఉండేందుకు రసాయనాలను ఇంజెక్ట్ చేస్తారు. దీనితో నెల రోజులైనా యాపిల్ పండ్లు నిగనిగలాడుతుంటాయి. అరటిపండ్లపై కూడా రసాయనాలను పిచకారీ చేస్తారు. దీనితో కొన్ని గంటల వ్యవధిలోనే అవి మగ్గినట్లు కనిపిస్తాయి. ద్రాక్ష పండ్లు కూడా కల్తీగా మారుతున్నాయి. ద్రాక్ష తోటలకు చీడపీడలు పట్టకుండా కెమికల్స్‌ను పిచకారీ చేస్తారు. ఈ కెమికల్ నేరుగా పండ్లలోకి చేరుతుంది. దానికి అదేవిధంగా తీసుకువచ్చి మార్కెట్‌లో విక్రయిస్తారు. ఇళ్లకు తీసుకువచ్చి వాటిని శుభ్రంగా కడిగి తినడం వల్ల ఆ ప్రభావం ఉండదని భావిస్తుంటారు. అయితే ద్రాక్ష తొడిమల నుంచి రసాయనాలు పండ్లలోపలికి చేరి ఉంటుంది. ఇవి నేరుగా మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఏదైనా ఘటనలు జరిగినప్పుడో, పత్రికల్లో వచ్చిన కథనాలను న్యాయస్థానాలు సుమోటో కేసుగా స్వీకరించి ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు మాత్రం నాలుగైదు రోజులు అధికారులు రోడ్లపైకి వచ్చి హడావిడి చేస్తారు. ఆ తరువాత మళ్లీ కల్తీ పండ్లు, కూరగాయలు, పాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తారు. పండ్లను రసాయనాలతో మగ్గిస్తే లక్ష రూపాయల జరిమానాతో పాటు 5 సంవత్సరాలు జైలు శిక్ష వేసే అవకాశం ఉంటుంది. కల్తీ పండ్లపై చర్చ జరిగినప్పుడు అధికారులు వ్యాపారులపై పదివేల నుంచి 20 వేల రూపాయల వరకు జరిమానాలు విధించి సరిపెట్టుకుంటారు. రసాయనాలతో కూడిన పండ్లను విక్రయిస్తే ఉద్యానవన శాఖ అధికారులు, స్థానిక సంస్థలకు చెందిన ఫుడ్ ఇనస్పెక్టర్లు కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచే అధికారం ఉంటుంది. అయితే నామమాత్రంగా ఉండే ఈ శాఖల సిబ్బంది పండ్ల వ్యాపారులపై దృష్టి సారించలేకపోతున్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు కూడా ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించి కేసులు నమోదు చేయవచ్చు. అయితే చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు పండ్ల వ్యాపారాలు చేసే వారి నుంచి నెలవారీ మామూళ్లను తీసుకుని రద్దీ ప్రాంతాల్లో కూడా తోపుడు బండ్లు పెట్టుకుని విక్రయించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. పండ్లలో ఏమేరకు కల్తీ జరిగిందన్న అంశాన్ని పరిశీలించేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. మార్కెట్‌లో లభించే పండ్లలో ఏది రసాయనాలతో మగ్గాయో, ఏది ప్రకృతిపరంగా పండుగా మారాయో అర్థం కాని పరిస్థితి వినియోగదారునికి ఎదురౌతోంది. చాలా సందర్భాల్లో మామూలుగా పండిన వాటి కంటే రసాయనాల ద్వారా పండిన పండ్లే ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. దీనితో ప్రజలు కల్తీ పండ్లుకొనే పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. ఒక ఏడాది పాటు అధికారులు కఠినంగా వ్యవహరించి కల్తీపండ్ల విక్రయదారులపై కేసులు నమోదు చేస్తే కొంత వరకు ఈ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# తెలుగు కీర్తి బావుటా ఎన్టీఆర్

నిలువెత్తు తెలుగుతనానికి ప్రతిరూపంలా నిలిచే దేదీప్యమాన తెలుగుతేజం, జగన్మోహన స్వరూపం, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, స్ఫురద్రూపం, కంచుకంఠం, తెలుగువారి అభిమాన నటుడు, దాదాపు అయిదు దశాబ్దాల సంచలనం, ఆరు కాలాల ప్రాభవం, కోటానుకోట్ల మంది అభిమానుల నీరాజనాలు, తెలుగు కీర్తిని విశ్వవిఖ్యాతం చేసిన నటుడు, ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగల నవరస నటనా వైదుష్యం, ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి గుండెల్లో నెలకొన్న వైభవ ప్రాభవం, తెలుగువారు గర్వించదగిన మహోన్నత వ్యక్తి, శకపురుషుడు, అవతారపురుషుడు, యుగపురుషుడు.. ఇన్ని రకాలుగా అభిమానులు సంబోధించే ఒకే ఒక్కడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు.

**కవర్ స్టోరీ**

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

**మూడు** తరాల ప్రేక్షకులను తన అసమాన అభినయంతో, నటనా చాతుర్యంతో సమ్మోహనపర్చిన కారణజన్ముడు తారకరాముడు. పౌరాణిక పాత్రలు చేయాలంటే ఒక్క తారక రాముడికి మాత్రమే సాధ్యం అని ప్రతి నోటా ఘంటాపథంగా వచ్చే మాట.
పౌరాణిక చిత్రాల్లో అంతలా ఒదిగిపోతారు ఎన్టీరామారావు. కృష్ణుడు, రాముడు, వేంకటేశ్వర స్వామి వంటి పాత్రలతో పాటు ప్రతినాయకుడైన రావణుడు, దుర్యోధనుడి పాత్రల్లో సైతం ఆయన ఒదిగిపోయి ఆ పాత్రలకు ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టారు. ఇలా ఏ పాత్రయినా ఆయన చేస్తేనే ఆ పాత్రకు సంపూర్ణ న్యాయం జరుగుతుందనేది ఏకాభిప్రాయం. పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చలనచిత్రాలలో ఎదురులేని మహోన్నత నటుడు ఎన్టీఆర్ అసమాన నట ప్రతిభ అందరికీ తెలిసిందే. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా, రాజకీయవేత్తగా, ముఖ్యమంత్రిగా ఎవరికీ సాధ్యం కాని రికార్డులను సొంతం చేసుకున్నారు. తెలుగుజాతి ముద్దుబిడ్డ, నిస్వార్థ, నిరుపమాన ప్రజాసేవకుడు, నీతి నిజాయితీలకు నిలువెత్తు రూపం, క్రమ శిక్షణకు, సమయపాలనకు మారుపేరు, తెలుగు సినీ పూదోటలో ఏనాటికీ వాడిపోని పారిజాత సుమము, తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్. సామాన్య కుటుంబంలో జన్మించి, పాలు అమ్మే స్థాయి నుండి పాలకుడి స్థాయికి ఎవరికీ అందని ఎత్తుకు ఎదిగిన కీ.శే. డాక్టర్ నందమూరి తారక రామారావు జీవిత విశేషాలు ఆయన శత జయంతి సందర్భంగా..

**బాల్యం:** ఎన్టీఆర్ తాత ముత్తాతలది ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో మోతుబరి కుటుంబం. ఆయన తాత పెదరామస్వామి అజమాయిషీలో 80 ఎకరాల వరకు పొలం ఉండేదని ఇక్కడివారు చెబుతున్నారు. ఆయనకు నలుగురు కుమారులు కావడంతో ఆస్తి వాటాలుగా తరిగిపోయి మధ్య తరగతి రైతు కుటుంబంగా మారిపోయింది. రామస్వామి పెద్ద కుమారుని పేరు రామయ్య. రెండవ కుమారుడు లక్ష్మయ్య చౌదరి. రామయ్య భార్య పేరు చంద్రమ్మ. ఈమె చెల్లెలు పేరు వెంకట్రామమ్మ. వీరి తండ్రి కాట్రగడ్డ సూరయ్యకు మగ సంతానం లేకపోవడంతో నిమ్మకూరు వచ్చి పెద్ద కుమార్తె చంద్రమ్మ వద్దనే స్థిరపడ్డారు. రామయ్య తన తమ్ముడు

లక్ష్మయ్య చౌదరికి యుక్తవయస్సు వచ్చాక మరదలు వెంకట్రామమ్మతో వివాహం జరిపించారు. అక్కాచెల్లెళ్ల తోడికోడళ్లవడంతో చాలా అన్యోన్యంగా ఉండేవారు. లక్ష్మయ్య, వెంట్రామమ్మ దంపతులే ఎన్టీఆర్ తల్లిదండ్రులు. నందమూరి తారక రామారావు 1923 మే 28 రుధిరోద్గారి నామ సంవత్సరం వైశాఖ మాస శుద్ధ ఏకాదశి సోమవారం సాయంత్రం 4.32 గంటలకు స్వాతి నక్షత్ర లగ్నంలో లక్ష్మయ్య చౌదరి, వెంకట్రామమ్మ దంపతులకు నిమ్మకూరులో జన్మించారు. తల్లి వెంకట్రామమ్మ ఆరాధ్య దైవం కృష్ణుడు కావడంతో తనకు కుమారుడు జన్మిస్తే కృష్ణుడు పేరు పెట్టాలని ఆమె భావించారు. అయితే ఎన్టీఆర్ పుట్టగానే "మన ఇంట్లో ఆ తారకరాముడే జన్మించాడు" అని బావ రామయ్య అనడంతో ఆయన సూచన కాదనలేక కుమారుడికి తారక రామారావు అని నామకరణం చేశారు. బాల్యంలో ఎన్టీఆర్‌ను 'తారకం బాబు' అని పిలిచేవారు. ఎన్టీఆర్ పెదనాన్న రామయ్యకు సంతానం లేని కారణంగా బాల ఎన్టీఆర్‌ను ఆయన దత్తత తీసుకుని ఎంతో గారాబంగా పెంచారు. బాల్యం నుండే నైతిక విలువలు నూరిపోశారు. రామాయణం, నీతి శతకాలు, పెద్దబాలశిక్ష.. ఇత్యాది చదివించి, వాటిలోని అంశాలను ఆకళింపు చేసుకునేలా చేశారు.

దాంతో ఎన్టీఆర్ బాలరామాయణాన్ని కంఠస్థం చేశారు. తమ గ్రామంలో ఉత్సవాలు జరిగినప్పుడు బాల ఎన్టీఆర్ అక్కడకు వెళ్లి రామకృతులను శ్రావంగా ఆలపించేవారు. ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలపట్ల మక్కువ పెంచుకోవడానికి ఈ విధంగా బాల్యంలోనే అంకురార్పణ జరిగింది. లక్ష్మయ్యచౌదరి, వెంకట్రామమ్మ దంపతులకు ఎన్టీఆర్ జన్మించినప్పటికీ పెదనాన్న రామయ్య, పెద్దమ్మ చంద్రమ్మ దంపతులకు సంతానం లేకపోవడంతో ఎన్టీఆర్ వారికి దత్తపుత్రుడయ్యారు.

ఎన్టీఆర్ తండ్రి లక్ష్మయ్య చౌదరి పొలం పనులు చూసుకుంటూ రైతుగా జీవనం సాగించేవారు. ఆయన అన్న రామయ్య మాత్రం కాస్త సరదా మనిషి. ఆయనకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నగర జీవనం అంటే మక్కువ ఎక్కువ. విజయవాడ పట్టణానికి వెళ్లడానికి ఇష్టపడేవారు. వేష భాషలు కూడా అందుకు తగినట్లే ఉండేవి. అందుకే నిమ్మకూరులో ఆయన్ని షోకు రామయ్య అని పిలిచేవారు. ఎన్టీఆర్ తమ్ముడు త్రివిక్రమరావు తల్లిదండ్రుల వద్ద పెరగగా, ఎన్టీఆర్ మాత్రం పెద్దమ్మ, పెదనాన్నల వద్ద పెరిగారు.

## విద్యాభ్యాసం

1933 ప్రాంతంలో నిమ్మకూరులో పాఠశాల లేదు. ఆ కారణంగా నిడుమోలు గ్రామానికి చెందిన నెల్లూరు వెంకట సుబ్బారావు రోజూ ఆ గ్రామం నుంచి 5 కి.మీ. నడిచి నిమ్మకూరు వచ్చి పిల్లలకు విద్యాబోధన చేసేవారు. సుబ్బారావు వద్ద ఎన్టీఆర్ అయిదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఎన్టీఆర్‌ను దత్తత తీసుకున్న రామయ్య, చంద్రమ్మ దంపతులు తమ నివాసాన్ని విజయవాడకు



మార్చడంతో ఎన్టీఆర్‌ను తమతో తీసుకుని వెళ్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. అటు నిమ్మకూరులో నివాసముంటున్న ఎన్టీఆర్ తండ్రి లక్ష్మయ్యచౌదరి ఆర్థిక పరిస్థితులు విషమంగా మారాయి. అప్పు చేసి కొన్న పొలం ధర పడిపోయింది. పైపెచ్చు చేసిన అప్పులు తీర్చేందుకు తక్కువ ధరలో పొలాన్ని అమ్మవలసి వచ్చింది. చేసేది లేక ఆ కుటుంబం కూడా రెండవ కుమారుడైన త్రివిక్రమరావుని తీసుకుని విజయవాడకు మకాం మార్చారు. లక్ష్మయ్య చౌదరి బెజవాడలో పాడిపశువులను నమ్ముకొని పాల వ్యాపారం ప్రారంభించారు. ఎన్టీఆర్ ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే మరోవైపు తల్లిదండ్రులకు పనులలో సహాయపడే వారు. ఆయన పాత హెర్క్యులస్ సైకిల్‌పై పాలు తీసుకుని వెళ్లి కొన్ని హోటళ్లలో పోసి వచ్చేవారు. ఎదిగిన తరువాత ఎన్టీఆర్ జీవితం అనేక మలుపులు తిరిగి పాలమ్ముకునే స్థాయి నుండి పాలకుడి స్థాయికి ఎదిగారు. 1940లో విజయవాడ పురపాలక ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఎన్టీఆర్ పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసుకుని శ్రీ రాజా రంగయ్యప్పారావు(ఎస్.ఆర్.ఆర్) కళాశాలలో ఇంటర్‌లో చేరారు. 1940 ప్రాంతంలో ఎన్టీఆర్ ఖాకీనిక్కరు, చొక్కా ధరించి హెర్క్యులస్ సైకిల్‌పై తిరిగేవారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ మంచి చిత్రకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయనకు చిత్రలేఖనమంటే చాలా ఇష్టం. బొమ్మలు బాగా చిత్రించేవారు. బెజవాడ(1941)లో జరిగిన ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి వైజ్ఞానిక మహాసభల్లో 'రైతుబంధన' పేరుతో రామారావు గీసిన ఇండియన్ ఇంక్ పెయింటింగ్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. ఎన్టీఆర్ చేతిరాత సైతం చాలా అద్భుతంగా ఉండేది. ఈ చేతి రాతను చూసి దస్తూరి గుణాల కస్తూరి అనే మాటను ముళ్లపూడి వెంకటరమణ తరచూ వాడేవారు. ఎన్టీఆర్ ఇంటర్‌లో రెండు పేపర్లు తప్పారు. ఒకసారి కాదు రెండు పర్యాయాలు ఇంటర్ తప్పారు. ఆ తరువాత చదువుకు స్వస్తి చెప్పి ఏదో ఒక వ్యాపారం చేసి తన కాళ్లపై తాను నిలబడాలని ఎన్టీఆర్ భావించారు. తండ్రిని ఒప్పించి సౌండ్ రికార్డింగ్‌లో శిక్షణ పొందేందుకు బొంబాయి వెళ్లారు. ఆశించిన విధంగా అక్కడ శిక్షణ కొనసాగకపోవడంతో అక్కడే మాతంగ అనే ప్రాంతంలో కొంత కాలం ఆంధ్ర భోజనశాల నిర్వహించారు. ఆ తరువాత తండ్రి లక్ష్మయ్య వెనుతిరిగి రావలసిందిగా కోరడంతో విజయవాడ చేరుకున్నారు. ఆ తరువాత కొంత కాలం పొగాకు వ్యాపారం చేశారు. పొగాకు వ్యాపారంలో ఉండగా ఆయనకు చుట్ట తాగడం అలవాటైంది. రోజుకు రెండు చుట్టలు కాల్చేవారు. కొంత కాలం తరువాత పొగాకు వ్యాపారం మానేసి ఒక ప్రింటింగ్ ప్రెస్ నడిపారు. ఈ వ్యాపారంలో కూడా నష్టం వచ్చి ప్రెస్ మూసేశారు.

## వివాహం

ఎన్టీఆర్ వివాహం మేనమామ కుమార్తె బసవతారకంతో 1942 మే 2వ తేదీన జరిగింది. 'వివాహం విద్యా నాశనం' అని మన పెద్దలు ఏ ముహూర్తాన చెప్పారోగానీ ఎన్టీఆర్ విషయంలో కచ్చితంగా జరిగింది.

చదువు మానేసి వ్యాపారం చేయడమేమిటని బంధుమిత్రులు హేళన చేశారు. దాంతో పట్టుదల పెరిగి విజయవాడలో చేస్తున్న వ్యాపారాన్ని తమ్ముడికి అప్పగించి, ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఆయన కోరిక మేరకు డిగ్రీలో చేరి బి.ఏ. విద్యాభ్యాసం చేయడానికి 1943లో గుంటూరుకు వచ్చి ఏ.సి.కళాశాలలో చేరారు. ఒకసారి కళాశాలలో విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'రాచమల్లు దౌత్యం' నాటకంలో ఎన్టీఆర్ నాగమ్మ పాత్రలో నటించారు. మీసాలు తీయడం ఇష్టంలేక అలానే నటించారు. దాంతో ఆయన మిత్రులు కొంత కాలం మీసాల నాగమ్మ అంటూ ఆటపట్టించారు. అప్పట్లో నవజ్యోతి, నాట్యసమితి పేరుతో రెండు ఔత్సాహిక నాటక సమాజాలు ఉండేవి. ఈ రెండింటిలోనూ ఎన్టీఆర్ మిత్ర బృందం నాటకాలు ప్రదర్శించేవారు. ఎన్టీఆర్ నాటకాలలో నటించడం చూసిన సి.పిల్లయ్య సినిమాలలో హీరోగా అవకాశం ఇస్తానన్నారు. అయితే బి.ఏ. పూర్తి చేసిన తరువాతే సినిమాలలో నటిస్తానని ఎన్టీఆర్ అన్నారు.



జ్ఞానీజైల్‌సింగ్‌తో ఎన్టీఆర్ కుటుంబం

### కుటుంబం

ఎన్టీఆర్‌కు మొత్తం 12 మంది సంతానం. 8 మంది కుమారులు, నలుగురు కుమార్తెలు. ప్రథమ పుత్రుడు రామకృష్ణ 16 ఏళ్ల చిరుప్రాయంలో చనిపోయారు. ఆ పేరును మరో కుమారుడికి పెట్టారు. ఎన్టీఆర్‌కు వివాహం జరిగిన తరువాత తల్లికి కృష్ణుడి పేరంటే ఇష్టమని తెలుసుకున్న ఎన్టీఆర్ తన మగ సంతానం పేర్లల్లో కృష్ణ అని వచ్చేలా రామకృష్ణ, జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ, బాలకృష్ణ, మోహన్‌కృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ అని నామకరణం చేశారు. తన కుమార్తెలకు ఈశ్వరీ అని వచ్చేలా లోకేశ్వరీ, పురంధీశ్వరి, భువనేశ్వరీ, ఉమామహేశ్వరి అని నామకరణం చేశారు. రెండో తరంలోనూ ఎన్టీఆర్ పెట్టిన పేర్లు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎన్టీఆర్ తన పెద్ద కుమారుడు జయకృష్ణ కుమార్తె పేరు కుమిదిని అని పెట్టారు. రెండవ కుమారుడికి ఇద్దరు కూతుళ్ళు ఉండగా వారి పేర్లు శ్రీమంతుని, మనస్విని అని పెట్టారు. బాలకృష్ణ ఇద్దరు కూతుళ్ల బ్రాహ్మిణి, తేజస్వినిగా పెట్టారు. చిన్న



కుమారుడు సాయికృష్ణ కుమార్తె పేరు కూడా ఈషాణి అని నామకరణం చేశారు. ఈ పేర్లు వింటేనే ఎన్టీఆర్ కళాత్మక హృదయం అర్థం చేసుకోవచ్చు. 1984 అక్టోబర్ 1 తేదీ సాయంత్రం గం.6.15 నిమిషాలకు ఎన్టీఆర్ సహధర్మచారిణి బసవతారకం మద్రాసులో శివైక్యం చెందారు. ఎన్టీఆర్ 1993 సెప్టెంబరు 11వ తేదీన లక్ష్మీపార్వతిని ద్వితీయ వివాహం చేసుకున్నారు.

### దర్శకుడు ఎల్వీప్రసాద్ పరిచయం

ఎన్టీఆర్‌కు దర్శకుడు ఎల్వీప్రసాద్ పరిచయం ఏర్పడిన పిదప మేకప్ టెస్ట్‌లు చేయించారు. నెలకు రూ.190 జీతంపై ఆయన గుంటూరులో సబ్ రిజిస్ట్రార్‌గా చేరారు. ఉద్యోగ జీవితంలో పడి సినిమా అవకాశాల విషయమే మరచిపోయారు. ఎన్టీఆర్ మద్రాసు వెళ్లిన పిదప ఎల్వీప్రసాద్ అప్పటి ప్రముఖ నటి, నిర్మాత కృష్ణవేణిని పరిచయం చేశారు. ఆమె ఎన్టీఆర్‌ను తమ సినిమాలో తీసుకుంటున్నట్లు అభినందించి రెండు వేల రూపాయల పారితోషికం ఇస్తామని, ప్రస్తుతం రూ.200 చెక్కును అడ్వాన్స్‌గా తీసుకోమని ఇచ్చారు. అలా ఎన్టీఆర్‌కు తొలి అవకాశాన్ని తొలితరం నిర్మాత, నటి కృష్ణవేణి ద్వారా 'మనదేశం'లో చిత్రంలో వచ్చింది.

### జాతకాలు మార్చిన 'పాతాళభైరవి'

విజయా వారి 'పాతాళభైరవి' ఎంతో మందికి కలిసొచ్చింది, జీవితాలను మార్చేసింది. విజయా ప్రొడక్షన్స్ సంస్థతో ఎన్టీఆర్‌కు 1949 నుండి విడదీయరాని అనుబంధం ఉంది. విజయావారి చిత్రాల విజయంతోనే రామారావు పరిశ్రమలో ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొని అగ్రశ్రేణి కథానాయకునిగా తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్నారు. 'మనదేశం' చిత్రంతో ఎన్టీఆర్ పరిచయమైనా, ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల'. అయితే విడుదలైన చిత్రం మాత్రం విజయావారి 'షావుకారు'.



ఈ చిత్రంలో నటిస్తూనే 'పల్లెటూరి పిల్ల', 'మాయారంభ', 'సంసారం' సినిమాల్లో నటించారు రామారావు. ఈ నాలుగు చిత్రాలు 1950లో విడుదలయ్యాయి. అప్పటికి ఎన్టీఆర్ వయసు 27 ఏళ్లు. విజయావారి తొలి చిత్రం 'షావుకారు' విశిష్టమైన సామాజిక ఇతివృత్తం కలిగిన చిత్రంగా జన బాహుళ్యంలో పేరు తెచ్చుకుంది. అక్కడ నుండి ఎన్టీఆర్ సినీ జీవితం పరుగులు తీసింది.

## పరుగులు తీసిన సినీ పయనం

పాతాళభైరవి తరువాత మూడున్నర దశాబ్దాల పాటు ఎన్టీఆర్ సినీ పయనం పరుగులు తీసింది. ఎన్టీఆర్ నటించిన 302 సినిమాలలో 275 హిట్లు,. వీటిలో 23 సినిమాలు 365 రోజులు ప్రదర్శితమైతే, 94 చిత్రాలు 300 రోజులు, 185 సినిమాలు 175 రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశాయి. ఎన్టీఆర్ 48 పౌరాణిక చిత్రాలలో నటించగా పలుమార్లు రాముడు, 17 సార్లు కృష్ణుడిగా, అంతర్నాటకాలతో కలిపి 33 సార్లు కృష్ణుడు, 18 చారిత్రక చిత్రాలు, అనేక జానపద చిత్రాలు, 32 చిత్రాలలో ద్విపాత్రాభినయం, 18 చిత్రాలు స్వీయదర్శకత్వం, 95 దర్శకులు, దాదాపు మూడున్నర దశాబ్దాల సినీ జీవితం, 13 సంవత్సరాల రాజకీయ జీవితం, మూడు






సార్లు ముఖ్యమంత్రి.. ఈ విధంగా ఆ అవతార పురుషుడి జీవితం గురించి చెప్పుకుంటూ పోతే ఒక మహా గ్రంథమే అవుతుంది. ఆయన తన నటనతో మెప్పించి, ప్రజాభిమానాన్ని చూరగొని విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు అయ్యారు. ఎన్టీఆర్ నటనను ప్రశంసిస్తూ యావత్ తెలుగు ప్రపంచం నీరాజనం పట్టింది. పురాణాల్లోని రాముడు, కృష్ణుడు ఎలా ఉంటారో ఎవ్వరికీ తెలియదు. అయితే ఏ తెలుగింటికి వెళ్లి అడిగినా ఆ రూపాల్లో ఉన్న తారక రాముడినే చూపిస్తారు. తెలుగువారికి రాముడు, కృష్ణుడు ఆయనే అని భావించేవారు అనేకమంది ఉన్నారు. వెండితెరపై ఎన్టీఆర్ చేయని పాత్రలేదు. పౌరాణిక, ఇతిహాసాల దగ్గర నుంచి చారిత్రకం, జానపద, సాంఘిక చిత్రాల వరకు అన్నీ చేసేశారాయన. వెండితెరపై నవరసాలను అలవోకగా పండించగల దిట్ట విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు. సినీ జీవితంలో తాను ధరించిన పాత్రల ద్వారా తెలుగు ప్రజల నీరాజనాలు అందుకున్న మహానటుడు ఎన్టీఆర్. ఆ రోజుల్లో తిరుపతి వెళ్లిన తెలుగు భక్తులు శ్రీవారిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుని, తమ ఆరాధ్య దైవమైన ఎన్టీఆర్‌ను చూడటానికి నేరుగా మద్రాసు వెళ్లేవారు. తిరుపతి వెంకన్నను చూసినప్పుడు వారికి కలిగిన అనుభూతిని ఎన్టీఆర్‌ను చూసినప్పుడు పొందేవారంటే అతిశయోక్తి కాదు. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు. తెలుగువారు నోరారా 'అన్న ఎన్టీఆర్' అని పిలుచుకుంటారు.

## రాముడిగా ఎన్టీఆర్

తొలిసారిగా ఎన్టీఆర్ రాముని గెటప్‌లో 'చరణదాసి' అనే సాంఘిక చిత్రంలో కనిపించారు. చరణదాసి చిత్రంలో 'సీత అగ్నిప్రవేశం' పేరుతో అంతర్నాటకం ఉంది. ఇందులో రామునిగా ఎన్టీఆర్, సీతగా అంజలీదేవి నటించారు. రాముడు, సీత పాత్రలలో వీరిద్దరిని చూసి తన్మయులైన నిర్మాత శంకరరెడ్డి ఆ తర్వాత ఎన్టీఆర్, అంజలీదేవితో 'లవకుశ' చిత్రాన్ని నిర్మించారు. అయితే ఎన్టీఆర్ శ్రీరాముని గెటప్‌లో పూర్తిస్థాయిలో




తొలుత కనిపించింది మాత్రం తెలుగు సినిమాలో కాదు. తమిళంలో నిర్మించిన 'సంపూర్ణ రామాయణం' చిత్రంలో. ఆ తర్వాత ఎన్టీఆర్ లవకుశ. 'రామాంజనేయ యుద్ధం', 'శ్రీరామ పట్టాభిషేకం' ఇలా అనేక చిత్రాలలో రాముడిగా నటించారు.

## రాముడు పేరుతో ఎన్టీఆర్ నటించిన చిత్రాలు

రాముడు పేరు ఎన్టీఆర్‌కు బాగా కలిసి రావడంతో ఆయన నటించిన 15 చిత్రాలకు రాముడు అనే పేరు వచ్చేలా పెట్టారు. ఆ చిత్రాలన్నీ అద్భుత విజయాలు సాధించాయి. అగ్గిరాముడు, శభాష్‌రాముడు, బండరాముడు,

టాక్సీ రాముడు, టైగర్ రాముడు, రాముడు-భీముడు, పిడుగురాముడు, రాముని మించిన రాముడు, అడవిరాముడు, డ్రైవర్ రాముడు, శృంగార రాముడు, ఛాలెంజ్ రాముడు, సర్కస్ రాముడు, సరదా రాముడు, కలియుగ రాముడు ఇత్యాదివి రాముడు పేరుతో ఎన్టీఆర్ నటించారు.

**ఇద్దరు పెళ్లాలు చిత్రంలో తొలిసారి కృష్ణుని పాత్ర**

1950 సెప్టెంబరు 22న విడుదలైన ఎన్టీఆర్ నాలుగో చిత్రం 'మాయారంభ'లో తొలిసారిగా పౌరాణిక పాత్ర పోషించారు. ఈ పాత్ర పేరు నలకూబరుడు. అయినప్పటికీ ఆ తర్వాత చాలా నెలల వరకు ఎన్టీఆర్‌తో ఏ నిర్మాత పౌరాణికాలు తీయలేదు. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత నాగూర్‌కు ఎన్టీఆర్‌తో కృష్ణుని గెటప్ వేయించాలనే కోరిక కలిగి 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో ఎన్టీఆర్‌కు కృష్ణుని గెటప్ వేయించారు. తొలిసారిగా ఎన్టీఆర్ 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో కృష్ణుని పాత్రలో కనిపించారు. కళాదర్శకుడు ఎఫ్.నాగూర్ స్వీయ దర్శకత్వంలో నాగూర్ సినీ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రంలో ఎన్టీఆర్ కృష్ణునిగా కనిపించేది ఒక నిమిషం మాత్రమే. కథానాయిక జమున కలలో కనిపించే సన్నివేశం. 'మదిలో హాయి కలలే రేపి విసిరే నీరేయి గోపాలా బాలా..' అనే పాటలో ఆయన కృష్ణుని గెటప్‌లో కనిపిస్తారు. 'ఇద్దరు పెళ్లాలు' చిత్రంలో ఎన్టీఆర్ పాత్ర పేరు మల్లు. జమున పాత్రపేరు కన్నమ్మ. 1954 అక్టోబరు 6న విడుదలైన 'ఇద్దరు పెళ్ళాలు' చిత్రంలో ఇలా వచ్చి అలా వెళ్లిపోయే మెరుపులాంటి సన్నివేశం కావడంతో ఎన్టీఆర్ గెటప్ గురించి ఆ రోజుల్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అసలు ఈ సినిమాలో ఆయన తొలిసారి కృష్ణునిగా నటించారన్న విషయం కూడా ఇప్పటికీ చాలామందికీ తెలియదు. 'సొంతవూరు' సినిమాలోనే ఆయన తొలిసారిగా కృష్ణునిగా నటించారన్న విషయం బహుళ ప్రచారంలో ఉండడమే దీనికి కారణం.

**సొంతవూరులో రెండోసారి కృష్ణుని పాత్ర**

1956 మే 23న విడుదలైన సొంతవూరు చిత్రంలో అంటర్నాటకంలో ఆయన పోషించిన కృష్ణుని పాత్రకు ధరించిన ఆహార్యం ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోయింది. కృష్ణునికి పెట్టిన కిరీటం అట్టదో, తోలుదో అన్న చందాన ఉండటంతో ఆహార్యం ఆకట్టుకోలేకపోయింది. ఎన్టీఆర్ పూర్తిస్థాయిలో కృష్ణుని పాత్రలో 'మాయబజార్' చిత్రంలో నటించారు. ఎన్టీఆర్‌ను మాయాబజార్‌లో కృష్ణుని పాత్రకు తీసుకోవద్దు, నష్టపోతారు అని చాలామంది హెచ్చరించారు. అయినా దర్శక, నిర్మాతలు ఎవరి మాటా లెక్కచేయలేదు. మాయాబజార్‌లో నటించినప్పుడు ఎన్టీఆర్ ఆహార్యం, వేషధారణలో పెనుమార్పులు చేశారు. కళాదర్శకులు గోఖలే స్కెచెస్ తయారు



చేశారు. బార్లే కూడా లైటప్ బాగే చేశారు. 'మాయాబజార్'లో కృష్ణుడు మొత్తం కథకే సూత్రధారి. అందుకే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎన్నో మేకప్ టెస్ట్‌లు చేసి, గెటప్‌ను ఫైనల్ చేయాల్సి వచ్చింది' అన్నారు. తర్వాత ఏకధాటిగా 17సార్లు అదేపాత్రను ధరించి రికార్డు సృష్టించారు. అంతర్నాటకాలతో కలుపుకుని 33సార్లు కృష్ణుని పాత్రలో నటించారు. ప్రపంచంలో మరే నటుడు ఇలా ఒకేపాత్రను అన్నిసార్లు పోషించి మెప్పించిన దాఖలాలు లేవు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదవ తరగతికి ఆంగ్ల పాఠ్యాంశంగా మాయబజార్ చిత్రాన్ని పొందుపరిచారంటే ఆ కథాంశం గొప్పతనాన్ని మనం గ్రహించవచ్చు.

**ద్విపాత్రాభినయంలో ఎన్టీఆర్**

ఒకేరకమైన పోలికలు గల వ్యక్తులను చూస్తే ప్రతి ఒక్కరూ కాసేపు అలౌకిక ఆనందాన్ని పొందుతారు. ముఖ్యంగా ఈ తరహా పాత్రల్లో హీరోలు కనిపించే సినిమాలు మన ప్రేక్షకులకు ఎంతో ఇష్టం. అలా ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తూ ఎన్టీఆర్ అనేక చిత్రాలలో ద్విపాత్రాభినయం చేశారు. దానవీరశూరకర్ణలో శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు మూడుపాత్రలు, శ్రీమద్విరాట్‌పర్వములో ఏకంగా ఐదు పాత్రల్లో నటించి మెప్పించారు. కులగౌరవం చిత్రంలో సైతం ఆయన తాత, తండ్రి, కుమారుడిగా మూడుపాత్రలను పోషించారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన అనేక చిత్రలు ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాదు. 1964లో తొలిసారి రాముడు-భీముడులో ద్విపాత్రాభినయం చేశారు. తర్వాత అదే ఏడాది అగ్గిపిడుగు, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మహాత్మ్యం ఇత్యాది చిత్రాలలో ద్విపాత్రాభినయం చేసిరికార్డు నెలకొల్పారు. అనంతరం మంగమ్మ శపథం, శ్రీకృష్ణపాండవీయం, డాక్టర్ ఆనంద్, గోపాలుడు-భూపాలుడు, నిర్దోషి, తిక్క శంకరయ్య, భలే తమ్ముడు, పిడుగురాముడు, అగ్గిపిడుగు, గండికోట రహస్యం, తాతమ్మకల, రాముని మించిన రాముడు, శ్రీరామ పట్టాభిషేకం, సర్కస్ రాముడు, మా ఇద్దరి కథ, వాడేవీడు, విశ్వరూపం, మనుషులంతా ఒక్కటే, ప్రేమసింహాసనం, చండశాసనుడు, యుగంధర్, గజదొంగ, కొండవీటి సింహం. జస్టిస్ చౌదరి, బొబ్బులిపులి, సర్దార్‌పాపారాయుడు, సామ్రాట్ అశోక చిత్రాల్లో ద్విపాత్రాభినయం చేశారు. శ్రీకృష్ణ సత్య చిత్రంలో రాముడు, కృష్ణుడు, రావణాసుడిగా నటించి రక్తికట్టించారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రంలో బ్రహ్మాగారితోపాటు వేమన, శంకరాచార్య, రామానుజాచార్య పాత్రల్లో కనిపించారు.



ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన పలు చిత్రాలలో కైకాల సత్యనారాయణ డూప్‌గా నటించేవారు. తొలిసారిగా రాముడు-భీముడు చిత్రంలో ఎన్టీఆర్‌కు ఆయన డూప్‌గా నటించడం పలు సన్నివేశాలలో స్పష్టంగా కనిపించింది.

### ఎన్టీఆర్ దర్శకత్వం వహించి, నటించిన చిత్రాలు

సీతారామ కళ్యాణం (1961), గులేబకావళి కథ (1962), శ్రీకృష్ణ పాండవీయం (1966), వరకట్నం (1969), తల్లా? పెళ్లామా? (1970), తాతమ్మకల (1974), దానవీరశూరకర్ణ (1977), చాణక్య చంద్రగుప్త (1977), అక్బర్ సలీమ్ అనార్కలి (1969), శ్రీరామ పట్టాభిషేకం (1978), శ్రీమద్విరాటపర్వం (1979), శ్రీ తిరుపతి వెంకటేశ్వర కల్యాణం (1979), చండశాసనడు (1983), శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (1984), బ్రహ్మర్షి విశ్వామిత్ర (1991), సామ్రాట్ అశోక్ (1992).

### ఎన్టీఆర్ నటించిన చివరి చిత్రాలు

ఎన్టీఆర్ మొదటి చిత్రమేది, చివరి చిత్రమేది అనే విషయమై వాద ప్రతివాదాలున్నాయి. ఎన్టీఆర్ హీరోగా అంగీకరించిన తొలి సినిమా పల్లెటూరి పిల్ల. అయితే విడుదలైంది మాత్రం షావుకారు చిత్రం. ఇదేరీతిలో ఎన్టీఆర్ నటించిన చివరి చిత్రం మేజర్ చంద్రకాంత్ కాగా విడుదలైన చివరి చిత్రం శ్రీనాథకవి సార్వభౌముడు.

### అందరి హృదయాలలో ఎన్టీఆర్

ఎన్టీఆర్ అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. అనేకమంది చిత్రకారులు తమకు నచ్చిన విధంగా, జనం మెచ్చేలా ఎన్టీఆర్ చిత్రాలను చిత్రించారు. ఎందరో శిల్పులు ఎన్టీఆర్ విగ్రహాలను శిల్పీకరించారు. ఎన్టీఆర్ పోలికలతో అనేకమంది నృత్యకారులు మన కళ్లముందు ఎన్టీఆర్ వచ్చి నాట్యం చేస్తున్నారా? అని భ్రమించే అంత గొప్పగా రికార్డింగ్ డ్యాన్సులు చేసి జన హృదయాలలో ఆయన గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఎన్టీఆర్ అనేక సేవా కార్యక్రమాలు చేశారు. రాయలసీమ సహాయార్థం, పోలీసులు, మనదేశ సైనికనిధి కోసం అనేక పర్యాయాలు రంగస్థలంపై సహ నటీనటులతో నాటకాలు వేసి వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించారు. అనేక సందర్భాలలో జనంలోకి వెళ్లి జోలెపట్టి విరాళాలు వసూలు చేసి సేవా కార్యక్రమాలకు వినియోగించారు. పుట్టినగడ్డ నిమ్మకూరులో బడి, గుడి, కళాశాల ఇత్యాది అనేక నిర్మాణాలు చేశారు. ఎన్టీఆర్ సహధర్మ చారిణి బసవతారకం పేరుతో హైదరాబాద్‌లో నిర్మించిన కేన్సర్ ఆసుపత్రి సామాన్యుడికి సైతం అమూలమైన సేవలను అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఎస్.సి.ఈ.ఆర్.టి. (స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) వారు పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను పాఠ్యాంశంగా పొందుపరిచారు.

### రాజకీయాల్లో సంచలనం ఎన్టీఆర్

సమాజమే దేవాలయం! ప్రజలే దేవుళ్లు! అనే నినాదంతో రాజకీయాలలోకి వచ్చి, తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది



నెలల కాలంలోనే వటవృక్షం లాంటి కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి ఆంధ్రప్రదేశ్‌లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తెలుగువాడి ఆత్మగౌరవం పేరుతో ప్రచార రథంపై సుడిగాలి పర్యటన చేశారు. అంతర్గత కుమ్ములాటలో కొట్టుమిట్టాడే కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా మారడాన్ని ప్రచారాస్త్రాలుగా చేసుకుని ఆయన చేసిన ప్రసంగాలు తెలుగువారి గుండెల్లో పౌరుషాగ్ని నిలిపాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. 1983 జనవరి 5న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక విజయం సాధించింది. 1983 జనవరి 9న ప్రజాస్వామ్య చరిత్రలోనే ప్రప్రథమంగా తనను ఎన్నుకున్న ప్రజల మధ్య ప్రజానేత ఎన్టీఆర్ ఎల్బీస్టేడియంలో తెలుగుదేశం ప్రభుత్వ మంత్రివర్గ ప్రమాణ స్వీకారం చేయడం విశేషం. 1983 జనవరి 9న ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో తన పేరును నమోదు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీఆర్ మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి. దేశంలోని కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలన్నీ ఒక్కచోట చేర్చి, నేషనల్ ఫ్రంట్ స్థాపించి దానికి కన్వీనర్‌గా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఏడు సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, అయిదేళ్లపాటు ప్రతిపక్ష నాయకుడిగా విరాజిల్లారు. ఆయన పాలనలో కిలో రెండురూపాయల బియ్యం మొదలుకొని ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ భారతదేశంలోని అనేక రాష్ట్రాలవారికి ఆదర్శంగా నిలిచాయి. 1989లో నేషనల్ ఫ్రంట్ స్థాపించి అధ్యక్షుడిగా కొనసాగారు. ఎన్టీఆర్ భారతదేశం పేరుతో జాతీయపార్టీ పెట్టాలనే కోరిక నెరవేరకుండానే పరమపదించారు. 1996 జనవరి 18న ఎన్టీఆర్ గుండెపోటుతో పరమపదించారు. భౌతికంగా ఆయన దూరమైనప్పటికీ ప్రజలు, అభిమానుల గుండెల్ల చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని అనేకమంది అభిమానులు దిక్కులు పిక్కటిల్లేలా కోరుతున్నప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో సైతం ఎన్టీఆర్ చిత్రాలను ప్రదర్శించడం విశేషం అక్కడితో ఆగిపోకుండా రాజకీయాల్లోకి వచ్చి తెలుగునేలకు, జాతికీ ప్రపంచ స్థాయి గుర్తింపు తేవడమే కాకుండా తెలుగు ప్రజలకు సేవ చేసే రాజకీయాలను ఎన్టీఆర్ పరిచయం చేశారు. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో తనదైన ముద్రవేసి నాయకుల్లో ఎన్టీఆర్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చాలామంది ముఖ్యమంత్రులు ఆచరించి విజయాలు సాధించిన ఉదంతాలు కోకొల్లలు. ఎన్టీఆర్ అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారనేది అక్షరసత్యం. ❑

# ఎక్కణ్నుంచో ఈ దరికి..




సూరీడు పొడుస్తే/ ఇక్కడంతా/ వెలుగు రేఖల సందడైతది
బద్దకాన్నీ నిద్దురమత్తున/ చద్దర్లోనే సర్దేసుకొని
మేలుకొలుపుల జాతర పాటొస్తది
మనం ఎక్కడున్నామన్నది ప్రశ్నే కాదు..
ఎంతవరకు వ్యాపించామన్నదే ముఖ్యం
గగనం నుంచి జారిన వర్షపు చుక్క
పుడమిని ముద్దాడి
విత్తును మొలకెత్తిస్తుంది చూడు..
నువ్వెక్కడో వున్నావని దిగులొద్దు
ప్రసరించు.. ప్రభవించు నలుదిశలా
నీ తాలూకు పరిధులన్నింటినీ తడుము
భూమికీ, ఆకాసానికీ/ ఏదో దోస్తానా వుందీ.. లేకుంటే
అక్కడెక్కడో/ రాతిరి మబ్బుల్లోనుంచీ
చందురుడు వెన్నెల కురిపిస్తే/ ఇక్కడ నయనానంద దృశ్యం
మనసంతా వెండిజాబిలి పారవశ్యం
చీకట్లను చీల్చుకొని/ అక్కడెక్కడో సుదూరాన
అదిగో../ ఎక్కణ్నుంచో పాయలు పాయలుగా
ప్రవహిస్తున్న జలం
ఈ నేలను తాకుతూ వెళుతుంది
పురాస్మృతుల్ని/ తనలో కలిపేసుకుపోతుంది చూడు..!

**- డాక్టర్ కటుకోఝ్వల రమేష్**

# క్షమించేశాను



నేనాకాశాన్ని
అంటుకోకూడదని
ఎగిరే నా రెక్కల్ని విరగ్గొట్టారు.
నేనాందించకూడదని
ఎగిరిపడే నా కలల్ని
కాలరాసారు.
నాకు ఎలాంటి
ఎదుగు బొదుగు వుండకూడదని
వాంటెడ్‌గానే
అవును.. వాంటెడ్‌గానే
వాళ్లు నన్ను టార్గెట్ చేశారు.
అయినా..
ఒక మహనీయునిలాగా
వాళ్ల తప్పుల్ని కప్పిపుచ్చాను..
వాళ్లని క్షమించేశాను.

**- సంగిపోగు ఆనంద్‌రాజు**

# సముద్రం

అదో పెద్ద జలరాశి
దరి చేరిన నదులను
తనలోన కలుపుకుని
ఎగిసిపడే జలనిధి.
గర్భాన ఖనిజాలు
దాగిఉన్న నిధులు
నిగ్గుతేలని నూనెలు
సహజ వాయువులు.
ఒకవైపు ఉప్పెనల మూలం
మరోవైపు ఉప్పుపొలం
నీటిపై తేలియాడే పడవలు
మత్స్యకారుల
అక్షయపాత్రలు.
ఆటు, పోట్లు
అలుపెరుగని అలలు
ఎగిసిపడే కెరటాలు
పోరాటానికి ప్రతీకలు.
తన ఘోషలో
బతుకుగోస కన్పిస్తుంది.
తన అడుగున
సంసారంలోతు అగుపిస్తుంది.
నురుగుల నవ్వులతో తీరానికి
నత్తగుల్లలు తెస్తుంది
ఆనందపు
ఆల్చిప్పలు అందిస్తుంది
తీరాలు సేద తీరే నిలయాలు.

**- జగ్గయ్య జి.**



## సాహిత్య విలోచన (విమర్శ వ్యాసాలు)



విరసం, సాహితీసంస్థ నెల్లూరు జిల్లా యూనిట్ యీ సాహిత్య విమర్శవ్యాసాలు ఓ చిన్న బులిటిన్‌గా ప్రచురించింది. పుస్తకం చిన్నదైనా విలువైన విషయాలెన్నో చర్చకు పెట్టారు. కవులు, రచయితలు, విమర్శకులు, సమీక్షలు, పాత్రికేయులు, సాహిత్య వేత్తలకు ఈ పుస్తకం చక్కటి గైడ్‌లా అవగాహన చేసుకునే పలు సాహిత్య, రాజకీయ సామాజికాంశాలు, చర్చించాల్సిన పలు అంశాలున్నాయి. 1970 నుండి 2015 దాకా సాహిత్య వాతావరణాన్ని ఈ చిన్న పుస్తకంలో చూడగలం. రచయితలకు స్వేచ్ఛ అంటే? విమర్శకు బాధ్యత ఎక్కువ, సాహిత్య విమర్శకు సిద్ధాంతమే దిక్సూచి, సాహిత్యం రాజకీయాలు వేరు కాదు. విప్లవ సాహిత్య విమర్శ, రచనల్ని సరిగ్గా అర్థం చేయించడం కూడా విమర్శ ప్రయోజనమే అనే వ్యాసాలు ఎంతో ఉపయుక్తమైనవి. వివిధ సందర్భాల్లో పత్రికల్లో వచ్చిన సాహిత్య వ్యాసాలు, వాటికి జవాబులు ఈ చిన్న పుస్తకంలో ఉన్నాయి. రచనల్ని సరిగ్గా అర్థం చేయించడం కూడా విమర్శనా ప్రయోజనమే' (పేజీ:39) వ్యాసం ఆలోచింపచేస్తుంది. కొ.కు., శ్రీశ్రీ, కె.వి.ఆర్., రా.రా–ల్ని అర్థం చేసుకోవాలి. 'తెలుగు కవిత్వంలో స్తబ్దత ఆవరించివున్న సమయంలో దానిని బద్దలుకొట్టగలిగిన శక్తి దిగంబర కవిత్వానికి అప్పట్లో ఉంది' అంటారు రచయిత. విప్లవ సాహిత్య విమర్శకులు రూపవాదాన్ని శిల్పవాదాన్ని మాత్రమే వ్యతిరేకిస్తారని త్రిపురనేని మధుసూదనరావు విడమర్చి చెప్పారు. **(సాహిత్య విలోచన, రచన: వి.చెంచయ్య, వెల: రూ 40, ప్రతులకు: అనేక పుస్తక కేంద్రం, 30-5-26/1, కోకా చలపతిరావు వీధి, ఏలూరు రోడ్డు, విజయవాడ)** **- తంగిరాల చక్రవర్తి**

## కుమ్మరి కతలలో మట్టి జీవన తాత్వికత



కుమ్మరుల జీవనచిత్రాలను మూరిశెట్టి గోవింద్, 15 కథలుగా రాయలసీమ మాండలికంలో తీర్చిదిద్దారు. అన్ని కులవృత్తులలాగే కుమ్మరివృత్తి అంతరించిపోయే దశకు చేరుకున్న ఈ కథలలో దశాబ్దాల నాటి సామాజిక జీవన నేపథ్యం చదువరులను కథవాస్తవిక రూపాలలో ఆకట్టుకొంటోంది. యదార్థ జీవితాలను కథలుగా మలిచి కష్టజీవుల వ్యధాపూరిత జీవితాలను ఆసక్తికరంగా రచయిత ప్రతిబింబింపచేసారు.

ఎన్నికాలాలు, యుగాలు మారినా స్వామికి మట్టికుండల్లో నైవేద్యం, కుమ్మరీ భీముడికథ, మట్టిలో కలిపే జీవితసత్యం వ్యక్తం చేసిన తాత్విక కథనం మడిసి మట్టికుండ, వానకు తడిసి కరిగిన పచ్చికుండ తన వునికిని పోగొట్టుకొన్న వైనం, కుమ్మరి చక్రాన్ని కళ్లకద్దుకొన్న కుమ్మరి మట్టి జీవనసత్యం, ప్రతీ కథలోనూ కుమ్మరి బతుకులకు ప్రాణాధారమైన మట్టి, కుండలు సావుపుటకల ప్రతీకగా గోవింద్ ప్రతిభావంతంగా ధ్వనింపచేసారు. మట్టితో శ్రమించి కుండలు తయారు చేసినోడికి ఫలితం దక్కని కుమ్మరి బతుకులపై లోకంతీరు, పీడిత వర్గాల అట్టడుగు జీవన వ్యథలు, మట్టిమీద మమకారం మాండలికంలో జీవింపచేసి నిగూఢ జీవనతాత్వికతను మూరిశెట్టి గోవింద్, దర్శింపచేసారు. **(కుమ్మరి కతలు, రచన: మూరిశెట్టి గోవింద్, వెల: రూ100, ప్రతులకు: చిన్నదొరవారి కండ్రిగ (గ్రామం మరియు పోస్ట్), కార్వేటి నగరం, చిత్తూరు జిల్లా)**

**- యర్రమిల్లి**

# పుస్తక సమీక్ష

## కళాత్మకం ఈ కథలు



పలు నవలలు కథలు శరత్‌చంద్ర పేరుతో కొన్నేళ్లుగా అందిస్తోన్న ఆర్.డి.విల్సన్‌కు వైవిధ్యమైన జీవితానుభవం ఉంది. జర్నలిస్టుగా, ఉపాధ్యాయుడిగా, సామాజిక ఉద్యమకారుడిగా, ఎస్.సి. కార్పొరేషన్‌కి ఛైర్మన్‌గా ప్రజల జీవితాలకు సాహిత్యం రాజకీయంతో ఉండే దగ్గరితనాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. వాస్తవానికి అద్దంపట్టే 'సమాహారం' కథల సంపుటిలో 22 కథలున్నాయి. వస్తుగ్రహణశక్తిలో పరిపూర్ణత, స్వీయజీవితానుభవాలను రచయిత తన కథల్లోకి వంపుకున్నారు. అందుకే వీరు పలు ప్రతిష్ఠాత్మకమైన బహుమతుల్ని పొందగలిగారు. వీరి ప్రతి కథా ఆలోచనా ప్రేరకమే. ఊరికి ఉపకారి తత్త్వంగల చిన్నాగాడు 'వేస్ట్‌ఫెలో' స్నేహితుడిచ్చిన సలహాను తనకు అనుకూలంగా అన్వయించుకుని సంపన్నుడయ్యాడు సందీప్. డబ్బు ఆడించే ఆటకు లొంగకుండా విలువల్ని పాటించే దయానిధి కథ రిజిస్ట్రేషన్. స్వప్రయోజనాల స్వార్థంతో చేదెక్కిన విద్యాలోకాన్ని చూపేకథ 'చేదెక్కిన లోకం'. ముగ్గురు మిత్రుల కథ రఘుపతి రాఘవరాజారాం. పెద్ద చేప చిన్నచేపను ఈలోకంలోలాగే తినే అక్వేరియం, జోగిని వ్యవస్థకు సంబంధించిన కథ దామిని, నిబద్ధతకు అద్దంపట్టే చెత్త, లాల్ బి.బ్లాక్ కథలు, సదాశయం సద్బుద్ధివైపు పయనమవ్వాలని చెప్పే 'పేటెంట్' అడుగుజాడ కథలు. రాజకీయాల్లో పదవి కంటే బహుమతి ఓ కథకు పొందటం ఆనందంగా భావించే రచయిత క్రియేటివిటీని సృజనాత్మకమైన ఆలోచనలకు అభినందనలు. **(సమాహారం కథలు, రచన: శరత్‌చంద్ర, వెల రూ: 200, ప్రతులకు: పాలపిట్టబుక్ హౌస్, మలక్‌పేట, హైదరాబాద్)** **- కూర చిదంబరం**

అడుగంటుతున్న మానవత్వాన్ని, మాయమవుతున్న మనిషితనాన్ని అన్వేషిస్తూ కవులు కలాలు ఝుళిపిస్తున్న కాలమిది. కవి చందలూరి నారాయణరావు 'మనుషులుగా బతుకును బతికిస్తూ/ మానవలోకంలో/ 'మనిషి గుర్తులను బతికించుకుందాం' అని పిలుపునిస్తున్నారు. 65 కవితల ఈ సంపుటి

## చక్కని పరిణత కవిత్వం



చదివింతర్వాత ఓ విధమైన వేదాంతధోరణి చుట్టుముట్టుతుంది. మనిషి అంటే ఎవరు? వాడి గుర్తులెక్కడ? మానవత్వం చిరునామా ఏది? ఒకవేళ మనిషి ఎక్కడైనా తారసబడితే..మనిషినెలాగూ దక్కించుకోలేం..కనీసం ఆ మనిషి గుర్తులనైనా బతికించుకుందామన్న ఆవేదన కవిది. 'మాట్లాడు మరణించినా సరే!/ మాట్లాడింది మరణించదుగా!' యిదీ చందలూరి కవిత్వతత్వం. ఈ కవికి సమాజంలో అన్నీ ఇరుకుగానే దర్శనమిస్తాయి. వీధి, ఇల్లు, పడక, నిద్ర, జీతం, జీవితం..యిలా అన్నీనూ. మరి ఇరుకు కాని దేమిటి? 'విశాలమైనది దరిద్రమొక్కటే/ విశాలంగా ఏరై పారేది కన్నీరొక్కటే- అని తేల్చి పారేస్తాడు. కవిత్వం, కవిత్వంలా రాయగల ఈ కవి 'చిక్కని పాలలో వెచ్చని నురగలా/ చక్కని నవ్వులో పచ్చని స్వేచ్ఛవు నీవు' అంటూ భావగర్భిత ప్రేమ కవిత్వం రాయడంలోనూ దిట్ట. మంచి పరిణత కవిత్వం ఆస్వాదించాలనుకునే కవితా ప్రియులను నిరుత్సాహపరచని కవితా సంపుటి యిది. **(మనిషి గుర్తుల్ని బతికించుకుందాం, రచన: చందలూరి నారాయణరావు, ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు)** **- రమణ వెలమకన్ని**



# ప్రాణాలు పీల్చేస్తున్న పొగాకు

కందుకూరి భాస్కర్

**ఒకసారి** చేసిన పొరపాటు అలవాటుగా మారుతుంది. ఆ అలవాటు వ్యసనమవుతుంది. ఆ వ్యసనం ప్రమాదకారి అవుతుంది. తెలిసో తెలియకో వ్యసనాలకు బానిసలు అయితే జీవితాంతం బాధపడవలసి వస్తుంది. నేడు కొంతమంది యువత, విద్యార్థులు తమ లక్ష్యాన్ని మరచి చెడు మార్గాల్లో పయనిస్తూ మాదకద్రవ్యాలు వాడటం, ధూమపానం చేయడం లాంటి చెడు పనులకు అలవాటుపడుతున్నారు. ఇది మొదట స్నేహితుల ద్వారా ఏదో సంతోషం కొరకు చేస్తున్నామని అనుకుంటారు కానీ తర్వాత క్రమంగా అదే వ్యసనంగా మారి వాటికి బానిసలు అవుతున్నారు. ఇలాంటి వ్యసనం కలిగించే పదార్థాలలో పొగాకు సంబంధించిన ఉత్పత్తులు కూడా అధికంగా ఉంటున్నాయి.

### పొగాకు వ్యతిరేక దినోత్సవం

మానవ శరీరారోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని దుర్భరం చేస్తున్న వాటిలో ధూమపానం చేయడం ఒకటి. ఇది మానవ శరీరానికి మిక్కిలి హాని చేస్తుంది. అందుకే ప్రజారోగ్యం దృష్ట్యా ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్లూహెచ్ఒ) ప్రతి సంవత్సరం మే 31వ తేదీన పొగాకు వినియోగం, దాని ఉత్పత్తికి సంబంధించిన ప్రమాదాల గురించి కుటుంబం, సమాజం, పర్యావరణంపై దాని దుష్ప్రభావం గురించి అవగాహన కల్పించేందుకు 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం'ను నిర్వహిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో నిర్వహించిన సమావేశంలో ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చింది. ఆ తర్వాత 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. అప్పటి నుండి పొగాకు వినియోగాన్ని తగ్గించడంలో అసాధారణమైన కృషి చేసిన వ్యక్తులకు సంస్థలకు వరల్డ్ నో టుబాకో డే సందర్భంగా డబ్ల్యూ హెచ్ఓ అవార్డులను కూడా అందజేస్తుంది.

### ధూమపానం, పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలు

పొగాకును సిగరెట్, బీడీ, చుట్ట, గుట్కా, జర్దా, నశం, ఖైనీ, హుక్కా మొదలైన రూపాలలో తీసుకుంటున్నారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలు అధికమే. పొగాకు వినియోగం, ధూమపానం మన ఆరోగ్యాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. పొగాకులో ఉండే 'నికోటిన్' అత్యంత వ్యసనపరమైన నది. దీనిద్వారా ఊపిరితిత్తులకు ముప్పువాటిల్లి మెదడులో రక్తప్రసరణకు అంతరాయం కలుగుతుంది. పొగాకు వినియోగం గుండె, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది. అంతేకాక స్వరపేటిక, నోరు, అన్నవాహిక, గొంతు, మూత్రాశయం, మూత్రపిండాలు, కాలేయం, కడుపు, పెద్దప్రేగు, జీర్ణవ్యవస్థ, గర్భాశయం, మధుమేహం, క్షయవ్యాధి, దంత సంబంధిత పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం వలన నరాల, మానసిక సంబంధిత రుగ్మతలతో పాటు అనేక రకాల కేన్సర్‌లకు ప్రధాన కారణం అవుతుంది. ఎముకలు బలహీనపడటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం జరుగుతుంది. సగటున పదేళ్ల జీవితకాలం తగ్గుతుంది. గర్భిణులు ధూమపానం చేయడం వలన పుట్టబోయే శిశువుకు అనేక రకాల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. కరోనా వంటి వైరస్ వ్యాధులు వచ్చినప్పుడు వారి ఆరోగ్యం మరింత బలహీన పడడం ద్వారా వంద మిలియన్ల మంది మరణించా రని ఒక అంచనా.

### పొగాకు పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తోంది?

పొగాకు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా పర్యావరణాన్ని కూడా అనేక విధాలుగా కలుషితం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 35 లక్షల హెక్టార్ల భూమిలో పొగాకు సాగు అవుతుంది. పొగాకు సాగు ప్రతి సంవత్సరం 2లక్షల హెక్టార్ల అటవీ నిర్మూలన, నేల క్షీణతకు కారణమవుతుంది. వేలాది రసాయనాలను గాలి, నీరు, నేలలోకి విడుదల చేయడం జరుగుతుంది. పొగాకును పండించడానికి రసాయనిక ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం అవసరం.



దీని ఫలితంగా నేల సంతానోత్పత్తి క్షీణిస్తుంది. దీంతో ఇతర ఆహార పంటల ఉత్పత్తి తగ్గుతుంది. పొగాకు ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. ఎందుకంటే పొగాకు వ్యవసాయ భూమి ఇతర ఆహార పంటల భూమితో పోల్చితే తన సారాన్ని తొందరగా కోల్పోతుంది. తద్వారా అవి బీడు భూములగా మారే అవకాశం ఉంది. పొగాకు తయారీ ప్రక్రియ 2 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ వ్యర్థాలను సృష్టిస్తుంది. పొగాకు పెంపకం రైతుల ఆరోగ్యానికి, భూగోళంకు హాని కలిగిస్తుంది. పర్యావరణానికి హాని కలిగించే పొగాకు ఉత్పత్తు ల వ్యర్థాలకు పొగాకు ఉత్పత్తిదారులను బాధ్యులను చేయడానికి కఠినమైన విధానం, మార్గదర్శకాలను రూపొందించడానికి ఇప్పటికే ఉన్న విధానాన్ని బలోపేతం చేయాలని డబ్ల్యూహెచ్ఓ లక్ష్యంగా పెట్టుకుంది.

### ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ థీమ్

ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్‌తో పొగాకు వ్యతిరేక దినోత్స వం నిర్వహిస్తుంది. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం థీమ్, పొగాకుకు సంబంధించిన సమస్యలను పరిష్క రించడానికి నిర్దిష్ట సమాచారాన్ని కలిగి ఉంటుంది. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్యసంస్థ గతమూడు సంవత్స రాల కాలంలో ప్రకటించిన థీమ్‌లు.

- **2020 థీమ్:** పొగాకు బహిర్గతం, - **2021 థీమ్:** నిష్క్రమించడానికి కట్టుబడి ఉండండి.

- **2022 థీమ్:** పొగాకు మన పర్యావరణానికి ముప్పు, **ఈ సంవత్సరం (2023), ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం థీమ్:** 'మనకు ఆహారం కావాలి, పొగాకు కాదు' (వీ నీడ్ ఫుడ్, నాట్ టొబాకో). ఉత్పత్తి ప్రత్యామ్నాయాల గురించి అవగాహన కల్పిం చడం ద్వారా పొగాకు ఉత్పతత్తిదారులు స్థిరమైన, పోషకమైన పంటలను అనుసరించేలా చేయాలని ఉద్దేశించారు. ప్రపంచ ఆహార సంక్షోభానికి దారితీసే పొగాకును స్థిరమైన పంటలతో భర్తీ చేయడానికి పొగాకు పరిశ్రమ విధ్వంసక కార్యక్రమాల ప్రయత్నాలు తగ్గుతాయి. అంతేకాక ఆహార ఉత్పత్తుల దిగుబడి పెరుగుతుంది. ఆహార సంక్షోభాన్ని అరికట్టడానికి పొగాకు రైతు లను ఆహార పంటల సాగుకు మార్చడం ద్వారా వారికి తగిన విధానాలు, వ్యూహాలు, మార్కెట్ పరిస్థితులను రూపొందించి అమలు చేయాలి.



### పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పొగాకు సాగును అరికట్టడానికి, ఇతర ఆహార పంటల సాగుకు మారడంలో రైతులకు సహాయంయింది. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం వార్షిక ఇతివృత్తాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచారాలను నిర్వహించడం ద్వారా పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సూచిస్తుంది. ఈ రోజున, ప్రభుత్వ అధికారులు, కార్యక్రమ నిర్వాహకులు ఆహార సంక్షోభాన్ని అరికట్టడానికి పొగాకు రైతులను ఆహారపంటల సాగుకు మార్చడం కొరకు తగిన విధానాలు, వ్యూహాలు, మార్కెట్ పరిస్థితులను రూపొందించి వాటి అమలు కొరకు తగు సూచనలు చేస్తారు. స్థిరమైన పంటలను పండించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వ్యసాయ సంఘాలలో అవగాహన కల్పిస్తారు. పొగాకు రైతులకు ఇతర వ్యవసాయ పద్ధతులపైన శిక్షణ సలహాలు ఇవ్వడం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వడం, రాయితీలు కల్పించి ఆర్థిక స్తోమత ఇచ్చేవరకు ప్రోత్స హించి వారిని ఇతర ఆహార పంటలవైపు మళ్లేలా చేయాలి.

### పొగాకు వినియోగదారులకు అవగాహన

పొగాకు, ధూమపానం వల్ల కలిగే వ్యాధులు మరణాలను గురించి తెలియజేసి పొగాకు వినియోగదారులలో అవగాహన కల్పించాలి. పొగాకును ఎందుకు విడిచిపెట్టాలో తగిన కారణాలను తెలపాలి.

### పేదరికానికి కారణం

పొగాకు కారణంగా 80శాతం మరణాలు తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో జరుగుతున్నాయి. మరో మాటలో చెప్పాంటే, పేద ప్రజలు చాలా ప్రతికూలంగా పొగాకు వలన ప్రభావితమవుతారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలు ఉపాధి కొరకు బీడీలు చేస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కాబట్టి బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించవలసిన అవసరం ఎంతైనా ఉంది. పొగాకు బానిసలు కావడం వలన విద్య, ఆహారం లేదా ఆరోగ్యసంరక్షణ కోసం ఉపయోగించబడే డబ్బు పొగాకుకు వెళుతుంది. ఇది ఉత్పాదకతను తగ్గిస్తుంది. ఆరోగ్యం కోసం చేసే ఖర్చును పెంచుతుంది. పొగాకును వాణిజ్యపంటగా పండిస్తే పేద, మధ్య ఆదాయదేశాలలో స్థిరమైన ఆహార ఉత్పత్తి ప్రమాదంలో పడవచ్చు. పొగాకు వినియోగం ఎక్కువగా తక్కువ, మధ్య ఆదాయ దేశాలలోనే ఉంది. ముఖ్యంగా ఆఫ్రికా నగరాల్లో ఈ ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయి. కఠినమైన నిబంధనల వలన అభివృద్ధి చెందిన దేశాలలో పొగాకు వినియోగం తక్కువగానే ఉంది.

**సెకండ్ హ్యాండ్ పొగ:** సెకండ్ హ్యాండ్ పొగ అనగా మనం ధూమ పానం చేయక పోయినా ధూమపానం చేసిన వారి దగ్గర ఉండటం వలన ఆ పొగను పీల్చడం జరుగుతుంది. దీని వలన అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. సెకండ్ హ్యాండ్ పొగ సంవత్సరానికి 6లక్షల మరణాలకు కారణమవుతుంది. బహిరంగ ప్రదేశాల్ల పొగతో కూడిన గాలిని పీల్చి అనారోగ్యం బారిన పడుతున్న బాధితు ల్లో దాదాపు 28శాతం మంది పిల్లలు ఉండటం విచారకరం. అందుకే అనేక నగరాలు, రాష్ట్రాలు ఇప్పటికే బహిరంగ ధూమపాన నిషేధాన్ని విధించాయి.

### ధూమపానం మానేయడానికి ఉత్తమమార్గాలు

పొగాకు లేదా ధూమపానం మానాలనుకునేవారికి ఆ కోరిక బలంగా ఉండాలి. వైద్యుడిని సంప్రదించి తగు కౌన్సెలింగ్ తీసుకోవాలి. పొగాకు కోరికలను నిరోధించడానికి చక్కెర లేని చూయిర్‌గమ్ లేదా గట్టి మిఠాయిని నమలడం, పొగ తాగేవారికి దూరంగా ఉండడం, పొగరహిత జోన్‌కు వెళ్లడం, రోజువారీ వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం చేయడం మొదలైనవి చేయాలి. ధూమపానం నుండి బయటపడే కార్యక్రమాల్లో పాల్గొనాలి. పొగ మానివేయడం వల్ల కలిగే లాభాలు తెలుసు కోవాలి. ఏ సమయంలో పొగాకు తీసుకోవాలనిపిస్తుందో గమనించి, దానికి గల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. వైద్యుల సలహాతో నికోటిన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయించుకోవడం మంచిది. పొగాకు జీవితాన్ని కాల్చివేస్తుందనే విషయాన్ని యువత గుర్తుంచు కోవాలి. పొగాకును వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ధూమపానం అనేది మన ఆరోగ్యాన్నే కాకుండా చుట్టూ ఉన్నవారి ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తుందనే విషయాన్ని గ్రహించాలి. వ్యాధి బారిన పడకుండా ముందే పొగతాగకుండా ఉండటం ఎంతో మేలు. ముఖ్యంగా యువత స్వీయ నియంత్రణ విధించుకుని మత్తు పదార్థాల వ్యసనానికి బానిస కాకుండా చూసుకోవాలి. యువత సన్మార్గంలో నడిచినప్పుడే సమాజం బాగుంటుంది. ❑

కథ

# తెలివైన బాతు



ఒక మడుగులో చేపలు, కప్పలతో పాటు ఒక చిన్న బాతు ఉండేది. ఒకసారి దానికి తెలియకుండా ఒక మొసలి వచ్చి ఆ మడుగులో చేరింది. అది మరునాడే బాతును తన నోటితో పట్టుకుంది. అప్పుడు బాతు ధైర్యంగా మొసలితో 'ఓ మొసలి మామా! నన్ను తినకు. మనమందరం నీటిలో ఉండేవారమే! మనం మిత్రులమే! ఎవరైనా మిత్రులను చంపుతారా? అని అంది.

అప్పుడు మొసలి 'మరి నేను ఏమి తిని బ్రతకాలి? నీవే చెప్పు?' అని ప్రశ్నించింది.

అప్పుడు బాతు 'నీవు బ్రతకడానికి నీకు ఇష్టమైన పండ్లను తిను. ఆ పండ్లు చాలా బలాన్ని ఇస్తాయి కూడా' అని అంది.

అపుడు మొసలి 'వాటిని నాకు ఎవరు ఇస్తారు?' అని అడిగింది.

అప్పుడు బాతు 'వాటిని నా మిత్రుడైన కోతి మామకు నీకు ఇమ్మని ఇప్పుడే నేను చెబుతాను' అంది. మొసలి సరేనంది. వెంటనే బాతు ఆ మడుగు ఒడ్డున ఉన్న తన మిత్రుడైన కోతిని కొన్ని పండ్లను మొసలికి ఇమ్మని చెప్పింది. చెట్టుపైన ఉన్న కోతి బాతు మాటలు విని కొన్ని పండ్లను మొసలి కొరకై చెట్టుపై నుండి ఆ మడుగులో రాల్చింది. ఆ మొసలి వాటిని తిని కడుపు నింపుకొంది.

ఆ తర్వాత కొన్ని రోజులకు అక్కడకు నక్క ఒకటివచ్చింది. అది నీటిలోకి దిగి నీటిని తాగింది. అప్పుడు అది మొసలి మాంసాహారం తినడం మానేసిందని తెలుసుకొని 'ఓ మొసలి మామా! నీకు ఇష్టమైన మాంసాహారాన్ని మానివేస్తావా? ఈ బాతు మాటలను నీవు నమ్ముతావా? అది పక్షి. మనం జంతువులం. దానితో నీకు స్నేహమేమిటి? దాని కొరకు నీ ఆహారాన్ని మానుకుంటావా!' అని అంది.

అప్పుడు మొసలి నక్క కాలును దొరకబుచ్చుకొని 'ఓ నక్కా! నీవు అన్నది నిజమే. నేను నిన్నే ఆహారంగా చేసుకుంటాను. నాకు మాంసాహారపు రుచిని తిరిగి గుర్తు చేశావు' అని అంది. ఊహించని ఈ పరిణామానికి నక్క ఆశ్చర్యపోయి ఏడుస్తూ 'ఓ మొసలి మామా! నీకు నేను మంచి చెబితే నన్నే పట్టుకుంటావా!' అంది. అప్పుడు మొసలి 'అవును. నీ మాంసం చాలా రుచిగా ఉంటుందని ఎవరో అంటుంటే విన్నాను' అని అంది.

వెంటనే బాతు అందులో కలుగజేసుకొని 'ఓ మొసలి మామా! ఆ నక్కను వదిలిపెట్టు. అది జిత్తుల మారి. దానికి ఒంటినిండా విషమే! అందువల్ల ఒకవేళ నీవు దాన్ని తింటే ఆ విషయం కూడా నీ రక్తంలో కలిసి ఆ వంకర బుద్ధులే నీకు కలుగుతాయి. అందువల్ల ఇప్పుడు నీకు ఉన్న ఆ మంచి పేరు కాస్తా పోతుంది. నా మాటలను విను' అని అంది. ఆ బాతు మాటలు విన్న మొసలి ఆలోచనలో పడి 'ఔను'. నీవు అన్నట్లు దీనివన్ని వంకరబుద్ధులే! మంచి చేసిన వారికే ఇది అపకారం చేస్తుంది. అందువల్ల దీని మాటల్ని నేను నమ్మనే నమ్మను. దీనికి బుద్ధి రావాలని నేను అలా అన్నాను' అని దానిని వదిలిపెట్టింది.

నక్క 'బ్రతుకు జీవుడా' అంటూ అక్కడి నుండి వెళ్తూ, ఆ బాతుకు ధన్యవాదాలు చెప్పింది. నక్క తనలో 'నేనే తెలివైన దానిని అని అనుకుంటే ఈ బాతు నాకన్నా తెలివైనది. ఇది ఆ మొసలి మనసునే మార్చివేసింది. నా ప్రాణాలను కూడా కాపాడింది' అంటూ అది బాతును ప్రశంసిస్తూ అక్కడి నుండి వెళ్లిపోయింది. ఆ తర్వాత బాతు, మొసలి, ఆ కప్పలు చేపలతో పాటు ఎంతో స్నేహంగా ఆ మడుగులో ఉండిపోయాయి.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
ధర్మపురి

## బాలగేయం

### ప్రకృతి



ఆకాశం
మాకు విశాల భావం
నేర్పింది
సూర్యుడు మాకు
క్రమశిక్షణ నేర్పాడు
పారేనది
లక్ష్యసాధన నేర్పింది
పచ్చని చెట్టు
పరోపకారం నేర్పింది
పర్వతగిరులు
స్థిరత్వం నేర్పాయి
ఇన్ని నేర్పిన
ప్రకృతియే మాకు ఆదర్శం
ప్రకృతిని
పరిక్షించుకోవడమే
మా ధర్మం

**-కొప్పల పద్మావతి**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.ఆకాశ్,** హన్మకొండ

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మధుమేహానికి, పంచదారకు ఎలాంటి సంబంధం ఉంది?

**జవాబు: ఆకాశ్!** 'మధుమేహం' అనే మాట వినగానే పంచదార/తీపి తినుబండారాలను పూర్తిగా మరిచిపోవాల్సిందేనని చాలామంది భావిస్తారు. తీపిని దూరంగా వుంచితే యాభై శాతం ఇబ్బందులైనా తగ్గుతాయని అనుకుంటారు. వాస్తవానికి పంచదార కన్నా ప్రమాదకరమైనవి మరికొన్ని ఉన్నాయి. వాటిని నియంత్రించడం అవసరం. మధుమేహ వ్యాధిలో పంచదార ఏమంత కీలకమైంది కాదు. ఆహారపు అలవాట్లనూ, జీవన విధానాలను క్రమబద్ధం చేసుకోవాలి. ఎక్కువ కేలరీల ఆహారాన్ని తీసుకోవడం, కడుపులో చల్ల కదలకుండా కూర్చోవడం.. ఈ రెండు కారణాల వల్లనే మధుమేహం వస్తుంది. లేదా కంట్రోల్ అవదు. పంచదార తాలూకు పాత్ర కొంతవరకు విస్మరించదగింది.

**- సిహెచ్.కార్తిక్,** కాకినాడ

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఏదైనా ఒక పక్షి ఒకే రుతువులో ఒకే సమయంలో ఒకే ప్రాంతానికి చేరుతుందని ఎలా గుర్తిస్తారు? ఆ పక్షి అక్కడికే చేరిందనడానికి రుజువు ఏమిటి?

**జవాబు: కార్తిక్!** ఈ అంశాలను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు మూడు పద్ధతులను అనుసరిస్తున్నారు. 1) పక్షుల కాళ్లకు సన్నటి రబ్బరు రింగులను కట్టడం. 2) రెక్కలకు రేడియో ట్రాన్సిమీటర్లను అమర్చడం. 3) రాడార్లను ఉపయోగించడం. మన దేశంలో పక్షుల కాళ్లకు రింగులు కట్టే పద్ధతి 1926లో ధార్ మహారాజా (మధ్యప్రదేశ్) ఆధ్వర్యంలో తొలిసారిగా ప్రారంభమైంది. 1960 నుంచి బొంబాయి నేషనల్ హిస్టరీ సొసైటీ ఈ ప్రయోగాలను కొనసాగిస్తోంది. ఏయే తరహాల పక్షులు ఎక్కడెక్కడికి వలస వస్తున్నాయి? ఎక్కడి నుంచి వలస వస్తున్నాయే విషయం తెలుసుకోవడానికి ఈ సొసైటీ చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలు అందించాయి.

# మీకోసం..



## బోన్సాయ్ దీపాలు

**ఇంటి** అలంకరణలో నేడు ముఖ్యభాగమయ్యాయి ఇండోర్ ప్లాంట్స్. వీటివల్ల ఇంట్లో ఆక్సిజన్ స్థాయిలు మెరుగవడమే కాకుండా ఇంటి లుక్ మారుతుంది. ఈ మొక్కల ట్రెండ్ మార్పులు చెందుతూ బోన్సాయ్ ట్రీలైట్లనీ తెచ్చేశాయి. అంటే చిన్ని చెట్టుకు కాయలుగా బల్బులు అదుర్స్ కదా! టేబుల్‌పై ఈ దీపాల మొక్కను పెడితే హాలుని కాంతితో నింపడమే కాకుండా మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఈ శోభాయమాన కాంతులకు ఇంట్లో అందరూ ఆనందిస్తారు.

### ఆహారం తాజాగా

**మనుపెన్నడూ** లేనంతగా నేడు ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఆహారాన్ని నిలువ చేసే పాత్రలు బిపిఏ ఫ్రీ, పీవీసీ ఫ్రీ యేనా అని చెక్ చేయడం పరిపాటిగా మారింది. ఫుడ్ జార్లు కూడా దీనికి మినహా యింపు కాదు. చల్లని లేదా వేడి ఆహార పదార్థాలని ఈ 'ఇన్సులేటెడ్ ఫుడ్ జార్'లో పెట్టడం వల్ల అవి తాజాదనాన్ని కోల్పోవు. సూప్, చికెన్, నగ్గెట్స్, పిజా రోల్స్, నూడ్యుల్స్, సలాడ్స్ లాంటివాటికి ఇది సరిపోతుంది. ఈ జార్ ఆఫీసులో, టూర్లకు వెళ్లినప్పుడు కూడా ఉపయోగపడుతుంది. ఇంటిల్లిపాదికి బాక్స్ కట్టడానికి అవసరం ఈ ఫుడ్‌జార్.

## కాఫీ, టీ..వేడిగా




**'వర్క్ ప్లేస్‌లో** కాఫీ చేసుకోవడం కష్టం'. ఇది నిన్నటి మాట. మార్కెట్లోకి 'స్మార్ట్ కాఫీ వార్మర్లు' వచ్చేశాయి. కప్పులో కాఫీ, టీ లేదా సూప్ పోసి పెడితే సరి. దిగువన ఉన్న ప్లేట్ వల్ల అది వేడిగా మారుతుంది. మరీ వేడిగా అవుతుందేమోనని దాన్నే చూస్తూ కూర్చోనక్కర్లేదు. ఉష్ణోగ్రతలు మించితే అదే ఆటోమేటిక్‌గా కటాఫ్ అవుతుంది. కెటిల్ కన్నా సులభంగా దీనిని ఎక్కడికైనా క్యారీ చేయొచ్చు.

## ఆయిల్ డిఫ్యూజర్



బయటంతా తిరిగి ఇంటికి వచ్చే వాళ్లకి ఇల్లు ఓ చిన్నపాటి స్వర్గంలా అనిపిస్తుంది. అదే ఎక్కువసేపు ఇంట్లోనే గడిపే వారికి అదే ఫీలింగ్ అందించాలంటే 'ఆయిల్ డిఫ్యూజర్' గిఫ్ట్‌గా ఇస్తే సరి. ఈ పరికరంలో కేవలం సువాసనే కాకుండా ఇంటిని తేమగా ఉంచే హ్యూమిడిఫైయర్, బ్లూటూత్ స్పీకర్ క్లాక్ కూడా ఉందనుకోండి.. వారి ఆనందానికి అవధులు ఉండవు. అంతేకాదు ఇంట్లోవారు అవసరమైనప్పుడు అలారమ్ సెట్ చేసుకోవచ్చు. నచ్చిన సంగీతాన్ని ఆలకించవచ్చు. మంచి సువాసనలు, తగినంత తేమ వల్ల ఇంటిల్లిపాదికి ప్రశాంతంగా ఉంటుంది. దీన్ని మీ స్నేహితులకు, బంధువులకు బహుమతిగా కూడా ఇవొచ్చు.

# కొత్తగా మార్కెట్లోకి..



**ఇప్పుడంతా** సోలార్‌మయమే. కుక్‌వేర్‌లోనూ సోలార్‌పైన అవుతోంది. ఎల్‌పిజీ, ఎలక్ట్రిసిటీతో పనిలేదు. సూర్యరశ్మి ఉంటే చాలు. అందులో వాటికంత

## సోలార్ ఇండక్షన్ స్టవ్

డిమాండ్. అలాంటి కిచెన్‌వేర్‌లో ఒకటే ఈ సోలార్ ఇండక్షన్ స్టవ్. దీన్ని ఎక్కడైనా ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. గర్భిణీలు, వృద్ధులు, పిల్లలు సైతం ఎలాంటి భయం లేకుండా ఈ స్టవ్‌పై వంట చేసుకోవచ్చు. మోడల్‌ని బట్టి వోల్టేజ్ కెపాసిటీని బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.







## ట్రావెలింగ్ మినీ కెటిల్



**దూరప్రయాణాల్లో** ఈ పోర్టబుల్ ఎలక్ట్రిక్ కెటిల్‌ను వెంటబెట్టుకుంటే ఎక్కడైనా సరేచక్కగా కడుపు నింపుకోవచ్చు. నచ్చిన వంటకాన్ని తక్కువ మోతాదులో సిద్ధం చేసుకోవచు , పైగా ఇందులో పాలు, టీ, కాఫీలు కూడా కాచుకోవచ్చు. అరలీటర్ సామర్థ్యం కలిగిన ఈ ట్రావెలింగ్ కుక్‌వేర్‌లోని ఇంటెలిజెంట్ హీటింగ్ సిస్టమ్ చాలా వేగంగా పనిచేస్తుంది. దాంతో నిమిషాల్లో వంటైపోతుంది. పాస్తా, నూడుల్స్, రైస్ ఐటమ్స్ వంటివన్నీ చేసి పెడుతుంది. లోపల ఫుడ్‌గ్రేడ్ స్టెయిన్లెస్ స్టీల్‌తో రూపొందిన ఈ డివైజ్..పైకి చాలా ట్రెండీ లుక్‌తో ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ డివైజ్‌తో పాటు మ్యాచింగ్ స్పూన్ కూడా లభిస్తుంది.



**పిక్నిక్‌కి** వెళ్లినప్పుడు లేదా పార్టీలప్పుడు ఆరుబయట వంట అనేది మామూలే. అలాంటి సందర్భాల్లో వండివార్చేవాళ్లకు అనువైనది ఈ ఫోల్డబుల్ బార్బెక్యూ బార్‌కోల్ గ్రిల్. దీన్ని అగ్గిపెట్టెలా తెరచి అందులో బొగ్గులు, చెక్క ముక్కలు తేలిక పాటి పుల్లలు వేసి నిప్పు రాజేసి క్లోజ్ చేస్తే చాలు బార్బెక్యూ స్టైల్లో ఫుడ్‌ను గ్రిల్ చేసుకోవచ్చు. దీన్ని మూవ్ చేసుకోవడమైతే పరమ ఈజీ. కాళ్లను

## ఫోల్డింగ్ బార్బెక్యూ గ్రిల్

ఫోల్డ్ చేసుకుని, ఒక బాక్స్‌లా మార్చు కుని తీసుకెళ్తే సరి. ఈ ఫోల్డబుల్ బార్బెక్యూ స్టైల్లో ఫుడ్‌ను గ్రిల్ చేసుకోవచ్చు. దీన్ని మూవ్ చేసుకోవడమైతే పరమ ఈజీ! కాళ్లను ఫోల్డ్ చేసుకుని ఒక బాక్స్‌లా మార్చుకుని తీసుకెళ్తే సరి. ఈ ఫోల్డబుల్ గ్రిల్ వెంట టే పొలం గట్టపైన, కొండలపైన, సముద్ర తీరాల్లోనూ నచ్చినవి వండుకుంటూ ఎంజాయ్ చేయొచ్చు.

కథ

# మాలతి అక్కయ్య

కె.భాస్కరాచారి

"నీతో నాకిక కుదరదు" అన్నాడు వినయ్ తన భార్య శృతితో.

"నేనూ అదే చెపుతున్నాను. మీలో నాకు ఫ్యూచర్ కనిపించడం లేదు" అంతే ధీటుగా అంది శృతి.

పావుగంట నుండి వాళ్ల మాటలు వింటున్న లాయర్ మాలతికి విసుగొచ్చి- "అబ్బబ్బ.. ఆపండి మీ గోల. ఇంతకీ మీకు ఏం కావాలి?" అంది.

"అర్జెంటుగా మాకు విడాకులు" కావాలి అని తేల్చి చెప్పారు, ఆమె ముందు కూర్చున్న ఆ యువజంట.

మాలతికి ఆ జంటను చూస్తే ఒకింత ఆశ్చర్యం, ముచ్చట వేసింది. ఇద్దరికీ నిండా పాతికా ముప్పై ఏళ్లు కూడా లేవు. చూడ్డానికి మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా వున్నారు. కానీ బిహేవియర్ మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉంది. ఇంటివద్ద గల తన ఆఫీస్‌కి వచ్చి రావడంతోనే ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు, అరిచారు, గోల చేశారు. నోట్‌ప్యాడ్ తీసుకొని "ముందు మీ గురించి వివరంగా చెప్పండి" అంది మాలతి.

"నేను ముందు చెపుతాను" ఆత్రంగా ముందుకొచ్చాడు వినయ్.

"అంతటా మీరే ముందుండాలి, మీ మాటే చెల్లుబాటు కావాలి" అలక పూనింది శృతి.

"ఇది పోలీస్ స్టేషన్ కాదు. ముందు ఫిర్యాదు చేసిన వారికి ప్రిఫరెన్స్ ఇవ్వడానికి నవ్వుతూ శృతిని శాంతపర్చింది మాలతి.

వినయ్ చెప్పుకొచ్చాడు.

"నేను గవర్నమెంట్ టీచర్‌నండి. కష్టపడి చదివి ఈ స్థాయికొచ్చాను. మా వాళ్లు ఎన్నో ఆశలతో నన్ను చదివించి ఇంతవాణ్ణి చేశారు. మావి మధ్య తరగతి బతుకులు. ఏదో నా ఖర్మకొద్ది వేడినీళ్లకు చన్నీళ్లు తోడైనట్లు వుంటుందన్న ఆశతో.. ఇదిగో.. ఈవిడ గారిని చేసుకున్నాను. ఫినిష్! మూడేళ్ల నుంచి నాకు మనఃశాంతి దూరమైంది. నాలాగే తను ఉద్యోగం వెలగబెడ్తున్నానని పెద్ద పోజు, పొగరు. అంతటా తన మాటే నెగ్గాలి" ఉక్రోషంగా చెప్పుకుంటూ పోయాడు వినయ్.

"అబద్ధాలు చెప్పకండి, మర్యాదగా వుండదు" మధ్యలో కలుగచేసుకుంటూ అంది శృతి.

"తనను పూర్తిగా చెప్పనివ్వు. నువ్వు చెప్పేది వింటాను కదా" అంది మాలతి.

"ఇదిగో ఇలాగే అనవసరంగా మధ్యలో దూరి అంతా పాడు చేస్తుంది" చిరాగ్గా అన్నాడు వినయ్.

శృతి మూతిని మూడు వంకర్లు తిప్పింది.

"మా పెళ్లికి ముందే చెప్పానండి... మా అమ్మా నాన్నలని చూసుకొనే బాధ్యత మనదేనని. అప్పుడు సిన్సియర్‌గా తలూపి ఇప్పుడు తోక జాడిస్తోంది".

"తోక జాడించడానికి నేను జంతువుని కాను" రోషంగా అంది శృతి.

"అదే నయం, కాస్తయినా విశ్వాసం చూపుతుంది" అన్నాడు వినయ్.

"చూశారా... చూశారా! నన్ను జంతువుతో పోల్చి తిడుతున్నారు" ఆరోపించింది శృతి. ఆమెను సైగతో వారించింది మాలతి.

"పెళ్లయిన మూడేళ్లకు ఇలా తింగరిగా వుంటే ముందు ముందు ఈ మహాతల్లితో ఎలా వేగాలి? కన్న తల్లిదండ్రులు కనిపించే దైవాలండీ! వారిని ఆదరించకుంటే కొడుకుగా నా జన్మ ఎందుకు చెప్పండి?" బాధగా అన్నాడు వినయ్ ముగిస్తూ.

మాలతి ఇప్పుడు శృతిని మాట్లాడమంది.

"లాయరుగారూ! ఎదగాలంటే ఎవరైనా కష్టపడాల్సిందే. నేను మాత్రం తన కంటే ఎందులో తక్కువ? తనలాగే బాగా చదువుకున్నాను. జాబ్ చేస్తున్నాను, సంపాదిస్తున్నాను. నాకు కోరికలు వుండవా? ఆశలుండవా? ఆకాంక్షలుండవా? ఉద్యోగస్తురాలినై వుండికూడా ప్రతి చిన్న అవసరానికి భర్తపై ఆధారపడే దౌర్భాగ్య స్థితి ఏ భార్యకు రావద్దండీ" కళ్లొత్తుకుంటూ అంది శృతి.

వినయ్ మధ్యలో అడ్డు పడ్తూ-

"తన జీతంలో నుండి అవసరాలకు సరిపడా డబ్బులు తీసుకున్నాకే మిగతావి ఇస్తుందండీ. అయినా వాటిని నా సొంత ఖర్చులకో, జల్సాలకో ఖర్చు చెయ్యడం లేదు. ఆమె ఇష్టంతోనే మా భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేస్తున్నాం".

శృతి అందుకొంది "రాక రాక ఎప్పుడైనా మా వాళ్లు వస్తే ప్రేమగా పలకరించడు, మర్యాద చెయ్యడు. కానీ వాళ్ల తరపున బంధువులు ఎవరు వచ్చినా నేను ఆఫీస్‌కి సెలవు పెట్టి మరీ సేవలు చెయ్యాలి. తనకు నచ్చినట్టుగా వుండాలి. ఏమాత్రం తేడా వచ్చినా గొడవలు. ఎందుకీ వివక్ష! నా వ్యక్తిత్వానికి గుర్తింపు, విలువ లేదు.

మరి దేనికి కలిసి వుండడం? తనే విడాకుల ప్రపోజల్ తెచ్చాడు. సరేనన్నాను".



అంతా విని మాలతి నిట్టూర్చింది. తన దశాబ్ద కాలం లాయర్ వృత్తిలో ఎన్నో కేసులు చూసింది, వాదించింది. హత్యలు, దొమ్మిలు.. వంటి క్రిమినల్ కేసులు. గృహ హింస కేసులు. వాటితో పోలిస్తే వీళ్లది చిన్న కేసు. కమ్యూనికేషన్ గ్యాప్, సర్దుబాటు ధోరణి లేనందువల్ల వచ్చిన ప్రాబ్లం. వీరికి లాయరు కాదు, ఫ్యామిలీ కౌన్సెలర్ సరిపోతారు. ఆ మాటే అంది మాలతి.

ఆ పని కూడా చేశారట. అమ్మా నాన్నను తన దగ్గర ఉంచుకోవాలని వినయ్; కాదు కూడదని శృతి ఎవరూ వెనక్కి తగ్గరట! ఇక కలిసి వుండడం కుదరదని విడాకుల కోసం తన దగ్గరికి వచ్చారట.

గాజు పెంకులాంటి కేసు, జాగ్రత్తగా డీల్ చేయకుంటే భళ్లున పగిలేలా వుంది. అనవసరమైన పంతాలకు పోతూ పచ్చని సంసారంలో నిప్పులు పోసుకుంటున్న ఈ యువ జంటకు విడాకులా? నో…నో.. అలా జరగకూడదు. వీరిని ఆపే ప్రయత్నం చేయాలనుకుంది.

“విడాకులు సరే. మరి కోర్టు కారణం అడిగితే ఏం చెబుతారు?”

“అమ్మా నాన్న మా దగ్గర వుండడం తనకు ఇష్టం లేదండి. నాకు మాత్రం వాళ్లే సర్వస్వం. ఇక ఈ విషయంలో మా అభిప్రాయాలు కలిసే అవకాశం లేదు. అందుకే మాకు విడాకులు కావాలి” మాలతి వినయ్ మాటలకు తల అడ్డంగా వూపింది.

“విడాకులకు మీరు చెప్పే కారణాలు సరిపోవు. మీలో ఎవరో ఒకరు గృహహింస బాధితులై వుండాలి. శారీరక, మానసిక వేధింపులకు గురై వుండాలి. వాటిని సాక్ష్యాలుగా చూపి కోర్టును విడాకులు కోరవచ్చు. సో.. మీ కేసులో బలం లేదు. ఐయామ్ సారీ” ఏదో విధంగా వారి ప్రయత్నాన్ని అడ్డుకోచూసింది మాలతి.

ఇద్దరు కొద్దిగా నిరాశపడ్డారు.

“మీకు చట్టాలు, వాటి సెక్షన్ల గురించి క్షుణ్ణంగా తెలుసు. ఏదో సెక్షన్ కింద మాకు విడాకులు మంజూరయ్యేలా చూడండి.. ప్లీజ్” అన్నారిద్దరూ బతిమిలాడుతూ.

“అది సరే శృతీ. పెళ్లికి ముందు వినయ్ చెప్పాడట కదా, వాళ్ల అమ్మా నాన్నను చూసుకోవాల్సి ఉంటుందని” అంది, మాలతి.

“నేను మర్చిపోలేదండి. అత్తయ్య వాళ్లది ఈ సిటీ పక్కనే ఓ పల్లెటూరు. గంట ప్రయాణం. మేం తరచూ వెళ్తూ పండగలు అక్కడే ఆనందంగా జరుపుకుంటాం. ఉద్యోగస్తుల గురించి మీకు తెలియంది కాదు.. ఉరుకుల పరుగుల జీవితాలు. అద్దె ఇల్లు, ఇరుకైన బతుకులు. ఆరోగ్యంగా ఉన్నంత కాలం అక్కడే ఉంటామన్నారు వాళ్లు. ఇటు ఉద్యోగం, అటు వాళ్లను చూసుకోవడం ఇప్పటినుండే ఎందుకని కొంత కాలం ఆగుదామన్నాను. ముందు ముందు ఎలాగూ తప్పదు. అంతే! ఆయన అంతెత్తున లేచారు. బోడి ఉద్యోగం మానెయ్యమని గొడవ చేశారు”.

“వాళ్లకు వయసు మీద పడుతోంది. ఏ క్షణం ఎలా ఉంటుందో! మన దగ్గర వుంటే కనిపెట్టుకొని వుండొచ్చు. ఐనా ఆరోగ్యంతో వున్న వాళ్లనే చూసుకోలేనిదానివి రేపు వాళ్లు మంచాన పడితే చూస్తావన్న గ్యారంటీ ఏమిటి? అందుకే తెగతెంపులు. అంత్య నిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు కదా” కటువుగా అన్నాడు వినయ్.

ఎవరి వాదన వారిదే. ఎవరూ మెట్టు దిగడం లేదు.

“సరే, మీ జీవితాలు మీ ఇష్టం. కానీ విడాకులు మీరు అనుకున్నంత తొందరగా రావు. అన్నింటికంటే ముఖ్యంగా మీ పేరెంట్స్‌ను సంప్రదించారా?” అంది మాలతి.

“మా జీవితాలు, మా నిర్ణయాలు మా ఇష్టం, ఇందులో వారి జోక్యం అనవసరం” అన్నారిద్దరు.

కాసేపు ఇద్దరితో విడివిడిగా మాట్లాడి చూసినా ఆమెకు ప్రయోజనం కనిపించలేదు. చివరగా నోట్‌ప్యాడ్‌ను పరిశీలిస్తూ “లైఫ్ అన్నాక కాస్తా పట్టువిడుపులు వుండాలి. పరిష్కారం వుందని నమ్మితే ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుంది. ఒకసారి కూర్చుని ఓపెన్‌గా మాట్లాడుకోండి” హితవు పలికింది మాలతి.

“ఫ్యామిలీ కౌన్సెలర్‌లా మాట్లాడకండి. మాకు విడాకులు కావాలి. అందుకే లాయర్ అయినా మీ వద్దకు వచ్చాం” అన్న వినయ్ మాటలకు ఆమె మనసు నొచ్చుకుంది. వాళ్లను వారం తర్వాత రమ్మంది. వారంలో ఇద్దరు వేరు వేరుగా ఫోన్లు చేశారు. షరా మామూలే. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేశారు. విడాకులు తొందరగా కావాలన్నారు.

ఓ రోజు మాలతి కోర్టులో వుండగా శృతి ఫోన్ చేసి ఏడ్చింది. జాబ్‌కు వెళ్లనివ్వడం లేదట. ఇంట్లో వంటా వార్పు బందట. హోటల్ నుండి వేరు వేరు పార్సిల్స్ తెప్పించుకుంటున్నారట. మాలతి శృతిని ఓదార్చి వినయ్‌తో మాట్లాడుతానంది. ఆమెలో కొద్దిగా కంగారు మొదలైంది. మ్యాడ్ గైస్. గోటితో పోయేదానికి గొడ్డలి వెతుకుతున్నారు. రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి వినయ్‌ని ఆఫీసుకు రమ్మంది. తను వచ్చాడు.

మీ ఆవిడ ఫోన్ చేసిందని శృతి పేరెత్తగానే సర్రున లేచాడు.

“చేస్తుంది.. ఎందుకు చేయదు, వున్నవి లేనివి మీతో బాగానే చెప్పి ఉంటది”.

“మీకు చట్టాలు, వాటి సెక్షన్ల గురించి క్షుణ్ణంగా తెలుసు. ఏదో సెక్షన్ కింద మాకు విడాకులు మంజూరయ్యేలా చూడండి.. ప్లీజ్” అన్నారిద్దరూ బతిమిలాడుతూ.
“అది సరే శృతీ. పెళ్లికి ముందు వినయ్ చెప్పాడట కదా, వాళ్ల అమ్మా నాన్నను చూసుకోవాల్సి ఉంటుందని” అంది, మాలతి.

“విడాకులకు అప్లయ్ చేసుకున్నారు కదా! మరి ఇంకా ఎందుకు గొడవలు?”

“అమ్మా నాన్న తిడితే ఎలా వూరుకుంటానండి? ఇలా కావడానికి వాళ్లే కారణమట. కన్నవారికోసం కట్టుకున్నదానికి అన్యాయం చేస్తున్నానట. ఇంట్లో పొయ్యి వెలగక మూడు రోజులైంది. ఇదెక్కడి న్యాయం? నాది తప్పెలా అవుతుంది. వాళ్లకు నేను దిక్కు. వాళ్లను చూసుకోవద్దా మరి!”

“కూల్ వినయ్! ముందు టీ తాగు..” అంది మాలతి.

ఇంతలో పొట్టిగా, సన్నగా వున్నతను వచ్చి ఇద్దరికీ టీలు ఇచ్చి వెళ్లాడు. వినయ్‌కి టీ తాగాక అప్పటిదాకా వున్న ఆవేశం కాస్త తగ్గి ఉపశమనం కలిగింది. గదిని పరిశీలించాడు. పెద్ద పెద్ద రోజ్‌వుడ్ షెల్ఫులు.. వాటినిండా లా పుస్తకాలు.

“ఈ వారంలో ఒక్క రోజైనా కూర్చుని మాట్లాడుకున్నారా?”

"పెళ్లై మూడేళ్లు గడిచినా ఇంతవరకు ఏదైనా సమస్య వస్తే కూర్చొని మాట్లాడు కున్నది లేదు. నేను ఒకటంటాను, వెంటనే తను అది కాంటుంది. అంతే! ఇక ఆ రోజంతా ఇంట్లో గొడవే. తనకు బాగా ఇగో అండి. ఉద్యోగం చేస్తోంది కదా. ఇంటా బయటా అందరు తన మాటే వినాలి. నో..నో అలాంటి వ్యక్తితో కూర్చొని మాట్లాడడమా? చూడండి.. తను తగ్గేదాకా నేను తగ్గను" తేల్చి చెప్పాడు వినయ్.

ఇంతలో బయట ఆడుకుంటున్న పాప వీల్‌చైర్లో కూర్చున్న మాలతిని చుట్టేసింది.

నాలుగేళ్లు ఉంటాయి. పాప ముద్దుగా బొద్దుగా వుంది. చురుకైన కళ్లతో చూడముచ్చటగా వుంది.

"శృతి నాతో సఖ్యతగా వుంటే ఇలాంటి పాపతో ముద్దు ముచ్చట్లలో తేలిపోయేవాడిని. నాకా అదృష్టం లేదు" అనుకున్నాడు, వినయ్.

"మీ పాపా అండీ"

"అవును.. తన పేరు ముగ్ధ. అంకుల్‌కు హాయ్ చెప్పమ్మా" పాప ముంగురులు సరిచేస్తూ అంది మాలతి.

"హాయ్ అంకుల్" అంది ముగ్ధ నవ్వుతూ.

"మీ వారు ఏం చేస్తారు మేడం?" ఆసక్తిగా అడిగాడు.

"ఒక నిమిషం.. తననే పిలుస్తానుండు" అంటూ భర్తను పిలిచింది.

వంట గదిలో నుండి ఇందాక టీ తెచ్చిన వ్యక్తి వచ్చాడు గరిట పట్టుకొని.

"టీ తాగారా?" నవ్వుతూ అడిగాడు వినయ్‌ని.

"తాగానని.." తలూపి వినయ్ ఆమె భర్త కోసం ఇంకా లోపలి వైపు చూస్తున్నాడు.

"వినయ్! ఇటు చూడండి.. ఈయనే మా వారు.. పేరు శ్రీకర్. ట్రాన్స్‌కోలో జాబ్ చేస్తారు" అంటూ భర్తను పరిచయం చేసింది.

ఒక్క క్షణం వినయ్ తడబడ్డాడు. నవ్వుతూ షేక్‌హ్యాండ్ ఇస్తున్న శ్రీకర్‌తో చేయి కలుపుతూ అయోమయంగా చూశాడు.

"కంగారుపడకండి వినయ్. ఈరోజు వంటమనిషి రాలేదు. మనం మాట్లాడుతూ బిజీగా ఉండడంతో నేను ఈ టైంకు టీ తాగుతానని తెలిసి తనే టీ కలిపి తెచ్చారు. తను బాగా వంట చేస్తారు. మంచి ఫిలాసఫర్ కూడా" నవ్వుతూ చెప్పింది మాలతి.

ఆ గందరగోళం నుండి కాస్త తేరుకొని ఇద్దరికీ సారీ చెప్పాడు వినయ్.

శ్రీకర్ తేలిగ్గా నవ్వేసి "భార్య భర్తకు టీ అందించడం మనకు అలవాటైన దృశ్యం. కానీ నువ్విప్పుడు అరుదైన దృశ్యం చూసావు అంతే! వినయ్.. ఒకటి చెప్పనా, జీవితం అంటే లాంగ్ డ్రైవ్‌కు వెళ్లడం లాంటిది. మంచి కంపెనీ ఇచ్చే వ్యక్తి పక్కన వుంటే ఎవరికైనా ప్రయాణ అలసటే తెలియదు. మరి ఆ వ్యక్తి మనమే ఎందుకు కాకూడదు. భార్యాభర్తలు ఇద్దరు ఇగోలు, లోగోలు పక్కన పెట్టి జీవించడం అలవాటు చేసుకుంటే లైఫంతా హ్యాపీగా గడిపేయొచ్చు మాలాగా. సరే.. సరే! మీరు మాట్లాడుకోండి. మీకు అంతరాయం కలిగించినట్టున్నాను. ఈరోజు లంచ్‌లోకి ఏం స్పెషల్



చేయమంటావు డియర్!" అదే చెరగని చిరునవ్వుతో అన్నాడు శ్రీకర్.

"పర్లేదండి. మీరు రెస్టు తీసుకోండి. ఈరోజు నేనే వంట చేస్తాను.. థాంక్యూ" అంది మాలతి.

"మమ్మీని డిస్టర్బ్ చెయ్యొద్దు.. రా నాన్నా" అంటూ పాపను లోపలికి తీసుకెళ్లిపోయాడు శ్రీకర్.

ఎందుకో అక్కడ వినయ్‌కి ఇక ఒక్క క్షణం వుండాలనిపించలేదు. డైవోర్స్ డాక్యుమెంట్లు త్వరగా సిద్ధం చెయ్యమని చెప్పి బయట పడ్డాడు.

ఏం మగ పుట్టుక.. భార్యకు టీ అందించడం. ఇలాంటివాళ్లు కూడా వుంటారా? లంచ్‌లోకి ఏం స్పెషల్ చేయమంటావ్ డియర్! వ్యంగ్యంగా శ్రీకర్ మాటలు ఇమిటేట్ చేసి తిట్టుకున్నాడు.

కానీ శ్రీకర్ మాటలు, పనులు స్వచ్ఛంగా ఉన్నాయనిపించింది. వారిద్దరి మాటల్లో దాపరికం, కల్మషం లేదు. ఉన్నదల్లా ఒకరి పట్ల ఒకరికి ప్రేమ, ఆపేక్ష.

"ఉదయం నుండి చూస్తున్నాను.. అదోలా వున్నావ్? నీ ఆరోగ్యం బాగానే వుంది కదా" అంది శృతి ఆఫీసులో తన బెస్ట్ ఫ్రెండ్ అయిన హిమ నుదుటిని తాకుతూ.

"నిన్నటివరకూ బాగాను ఉన్నాను శృతీ. ఇక ఈ రోజు నుండి నా జీవితంలో ఆనందం ఆవిరి కానుంది" అంది బాధగా.

"ఆనందం ఆవిరి కావడం ఏమిటి?" అర్థం కానట్టు చూసింది శృతి.

"మా ఆడపడుచు ఈరోజు నుండి ఇక ఎప్పటికీ మా ఇంట్లోనే వుండబోతోంది".

"ఆమె మీ ఇంట్లో వుండిపోవడం ఏమిటి? కాస్త అర్థమయ్యేలా చెప్పవూ!"

"చెపితే పరువు పోతుంది. మా అత్తగారి తరపువాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. మా ఇద్దరి సంపాదనతో కష్టపడి కూడబెట్టిన డబ్బుతో ఈవిడగారికి ఘనంగా పెళ్లి చేసి అత్తారింటికి పంపాం. ఉద్యోగస్తుడైన భర్తతో చక్కగా కాపురం చేయొచ్చు కదా. పెళ్లయిన రెండు నెలలకే తిరిగి వచ్చేసింది. ఎందుకంటే ఏమీ చెప్పదు. భర్త గురక పెడతాడని, వాళ్ల అత్త తనకసలు నచ్చలేదనీ.. ఇలా ఏవో కుంటిసాకులు చెప్పేది.

మేం బుజ్జగించి పంపడం, తను వారంలోపే మళ్లీ పుట్టింటికి రావడం. ఇదే తంతు. అతను చూసి చూసి విసుగొచ్చి ఇప్పుడు విడాకులు ఇచ్చేశాడు. ఇంకేం! ఆ మహాతల్లి మా ఇంటికి వచ్చేసి మా గుండెల మీద మళ్లీ కుంపటిలా కూర్చుంది. ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. వీధిలో తలెత్తలేకుండా వున్నాం" ముక్కు చీదుతూ చెప్పింది హిమ.

"విడాకులు తీసుకోవడం అంత పరువు తక్కువ పనా?" తనకు నచ్చనివాడితో తను మాత్రం ఎలా కాపురం చేస్తుంది చెప్పు?"

"లేదు శృతీ! ఆ అబ్బాయి అన్ని విధాలా తగినవాడు. మా ఆడపడుచు ఇష్టంతోనే ఈ పెళ్లి జరిగింది. ఆమెది ఒట్టి పెంకితనం, మొండితనం. ఆ గుణాలే ఇప్పుడు మా కొంప ముంచాయి.

సంసారం అంటేనే ఓ సర్దుబాటు, ఓ కమిట్‌మెంట్. మనమైతే ఇలాగే చిన్న చిన్న కారణాలతో మన కాపురాల్ని కూల్చేసుకొని కన్నవారిని వీధిన పడేస్తామా.. చెప్పు".

హిమ అలా ఒక్కసారిగా అడిగేసరికి శృతికి వెన్నులో ఝల్లుమంది.

శృతి తడబడింది. జవాబు కోసం తడుముకుంది. విషయం దాటవేస్తూ "పద.. లంచ్‌కు టైం అవుతుందంటూ" తొందర చేసింది.

లంచ్ చేస్తుంటే తన అన్నా వదిన గుర్తుకొచ్చారు.

నాలుగు రోజుల తర్వాత శృతి, వినయ్‌లు లాయర్ ఇంటికి వెళ్లారు.

"డాక్యుమెంట్లు సిద్ధం చెయ్యమని పత్తా లేకుండా పోయారు, ఫోన్లో దొరకరు. ఈరోజు విడాకులకు అప్లయ్ చేద్దామనుకుంటున్నాను"

తనకు ఎదురుగా కూర్చున్న వాళ్లవంక సూటిగా చూస్తూ అంది మాలతి.

"మమ్మల్ని క్షమించండి లాయరుగారూ! ఇక వాటి అవసరం మాకు లేదు" అన్నాడు వినయ్ గట్టిగా.

ఒక్కసారిగా మాలతికి ఆ మాటలు మండు వేసవిలో మంచుజల్లులుగా చల్లగా మనసును తాకాయి.

"అవును లాయరుగారూ, మాలోని ఇగోలను పక్కన పెట్టి మొదటిసారిగా కూర్చుని మనసువిప్పి మాట్లాడుకున్నాం. ఆశ్చర్యకరంగా ఒకరి ఉద్దేశాలు ఒకరం తేలిగ్గా అర్థం చేసుకోగలిగాం. ఈ విషయంలో నా స్నేహితురాలు హిమ తన ఆడపడుచు గురించి సరైన టైంలో చెప్పి నా కళ్లు తెరిపించింది. ఆది విన్న తర్వాత నేనే వినయ్‌తో కాస్త హార్ష్‌గా బిహేవ్ చేస్తున్నానని తెలుసుకున్నాను" అంటూ హిమతో జరిగిన సంభాషణ అంతా చెప్పింది శృతి.

"అందుకేనా, నేను చెప్పేది సహనంతో ఆసాంతం విన్నావ్" అన్నాడు వినయ్ శృతి వంక మెచ్చుకోలుగా చూస్తూ.

ఆమె చిరునవ్వు నవ్వింది.

"ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. మీకు గుర్తుందా మాలతిగారూ! ఆ రోజు మీ శ్రీవారు శ్రీకర్ గారిని నేను వంటమనిషిగా పొరపడ్డ సంఘటన. అది నన్ను ఆలోచింపచేసింది. భార్యా భర్తల మధ్య నిజమైన అనుబంధానికి, ప్రేమకు ఎలాంటి పట్టింపులు, భేషజాలు వుండవని తెలిసింది. మూడేళ్ల మా కాపురంలో ఫర్ ద ఫస్ట్ టైం శృతి వెర్షన్ కూడా వినాలనుకున్నాను. విన్నాక తెలిసింది ఆమె మా అమ్మా నాన్నను చూసుకోడానికి మనస్ఫూర్తిగా సిద్ధంగా వుందని" మెరిసే కళ్లతో అన్నాడు వినయ్.

"కన్నవారిని ప్రేమించే భర్త దొరకడం నా అదృష్టం మాలతిగారూ. నా మట్టిబుర్రకు అర్థంకాలేదుగానీ తల్లిదండ్రుల పట్ల ఇంత బాధ్యతగా వున్నవాడు తన భార్య, కుటుంబం పట్ల అంతే బాధ్యతగా వుండి తీరుతాడు. మా మధ్య వున్న కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఎక్కడ నిర్లక్ష్యం చేస్తాడోనసే అభద్రతా భావం నాలో నిత్యం వుండేది. అందుకే ఆయన ప్రతి మాటకు అడ్డుపడుతూ వచ్చాను. ఆయనతో మాట్లాడాక కొడుకుగా తన బాధ్యతను నెరవేర్చడానికి ఆరాటపడుతున్నాడని తెలుసుకున్నాను. ఇక మాకు విడాకులు అవసరం లేదండి" అంది శృతి ఆనందంగా.

"మేం అర్థం చేసుకోలేదుగానీ మొదటి నుండి లాయర్‌గా కాక ఒక తోబుట్టువులా మమ్మల్ని కలపాలని చూశారు మీరు. మా బంధం విచ్చిన్నం కాకుండా కాపాడాలని చూసిన మిమ్మల్ని 'మాలతి అక్కయ్య' అని పిలవాలని వుంది అన్నాడు ఉద్వేగంగా వినయ్.

ఆ మాటలకు మాలతి కళ్లు సంతోషంతో చెమ్మగిల్లాయి.

....




అది సిటీ గ్రాండ్ హోటల్.

హిమకు, తన భర్త శ్రీకర్‌కు మంచి ట్రీట్ అరేంజ్ చేసింది మాలతి.

"నేను చెప్పింది చక్కగా చేశారు. మీ వల్ల వారిలో అపోహలు తొలగించి, మళ్లీ ఒకటి చేయగలిగారు. మీ ఇద్దరికీ చాలా చాలా థాంక్స్" నవ్వుతూ సంతోషంగా అంది మాలతి.

"ఒక స్నేహితురాలిగా అది నా బాధ్యత మేడం. ఇందులో నా సహాయం కంటే వాళ్లను ఒకటి చెయ్యడానికి మీరు పడిన శ్రమ, ఆరాటం గొప్పది. అది నన్ను కదిలించింది. అందుకే చిన్న అబద్ధాన్ని అందంగా రక్తి కట్టించి శృతిని నమ్మించి ఆత్మవిమర్శ చేసుకునేలా చేశాను" అంది మెరిసే కళ్లతో హిమ.

టీ గ్లాస్ కింద పెడుతూ "మీ ఇద్దరు నా కష్టం మర్చిపోతున్నారు. హిమా.. నిన్ను కలవడం కోసం శృతికి తెలియకుండా మీ ఇంటికి, ఆఫీసుకి ఈ మహాతల్లి నాతో కార్లో ఎన్ని సార్లు చక్కర్లు కొట్టించిందో లెక్కేలేదు. అంతేనా! అసలు పాలు కలపడమే రాని నాకు ట్రైనింగ్ ఇచ్చి మరీ నాతో టీ పెట్టించుకుని తాగింది".

అతని మాటలకు ఇద్దరూ గట్టిగా నవ్వారు.

"థాంక్స్ శ్రీవారూ.. వినయ్, శృతిల మధ్య చిన్న కమ్యూనికేషన్ గ్యాప్. అపార్థం, అవగాహనా లోపం. దాన్ని సరి చేయడానికి మీతో ఇలా చేయించాల్సి వచ్చింది" అంది మాలతి.

భార్య వైపు గర్వంగా చూస్తూ "ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యు మాలతీ. విడాకుల కేసు అనగానే ఇలా ఇప్పించేసి అలా డబ్బులు దండుకునే లాయర్లు వున్న ఈ రోజుల్లో కాపురాలు నిలబెడుతూ వివాహ బంధాన్ని కాపాడాలని తపించే నువ్వు నా భార్య కావడం నా అదృష్టం" అన్నాడు శ్రీకర్.

ఆ మాటలకు హిమ సంతోషంతో గట్టిగా చప్పట్లు కొట్టింది. ●

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# ఆగ్నేయంలో మెట్ల నిర్మాణం ఎలా ఉండాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4**, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: **9885446501/9885449458**




## ఆగ్నేయంలో రెండు వరుసల మెట్లు

ఇంటికి, కాంపౌండు గోడకీ మధ్య తూర్పున ఎక్కువ ఖాళీ స్థలం వున్నట్లయితే తూర్పు ఆగ్నేయంలో మెట్ల నిర్మాణం వీలవుతుంది. రెండున్నర అడుగుల వెడల్పుతో రెండు వరుసల మెట్ల నిర్మాణం జరపవలసివచ్చినప్పుడు తూర్పున కనీసం ఆరడుగుల ఖాళీ స్థలం వుండాలి. ఐదడుగుల మెట్ల వరుసలకు పోతే మిగిలిన మరో అడుగు స్థలం కాంపౌండు గోడ నుండి ఖాళీగా ఉండాలి.

ఆగ్నేయంలో వంటగది కట్టవలసి వచ్చినా తూర్పుగోడకు వెంటిలేటర్స్ గానీ, కిటికీలుగానీ ఏర్పరచటానికి ఈ మెట్లు నిర్మాణం అడ్డు రాదు. మెట్లకింద గది కట్టకుండా తెరచిపెట్టి అక్కడ వంటసామాన్లు కడుక్కోవడానికి ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ నీళ్ల మాత్రం ఈశాన్యం వైపుకు వెళ్లాలనే మూల సిద్ధాంతం మామూలే.

ఆగ్నేయంలో ఇలా మెట్లు నిర్మించినప్పుడు ఈశాన్యంలో ఇంటికి పోర్టికో నిర్మాణం జరపాలి. మొత్తం మెట్ల నిడివికి సమానంగా కానీ మరింత ఎక్కువ

దక్షిణ కాంపౌండు గోడను తాకుతూగానీ, తాకకుండాగానీ వుండవచ్చు. మొదట పశ్చిమాభిముఖంగా ఎక్కి, ఉత్తరానికి తిరిగి తూర్పు అభిముఖంగా ఎక్కి, బాల్కనీలోకి ప్రవేశించి పై అంతస్తు ఇంట్లోకి ఉచ్ఛస్థానమైన దక్షిణ ఆగ్నేయద్వారం గుండా ప్రవేశించాల్సి ఉంటుంది.

అలాగే మూడు అడుగుల వెడల్పుతో రెండు వరుసల మెట్ల నిర్మాణం జరిపినప్పుడు తూర్పున కనీసం ఏడడుగుల స్థలం ఖాళీగా వుండాలి. మెట్ల వరుసలకు ఆరడుగులు పోతే మిగిలిన ఒక అడుగు కాంపౌండు గోడ నుండి మెట్ల వరకు ఖాళీగా వుండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మెట్లు తూర్పు కాంపౌండు గోడకూ మధ్యన వుండాలి. మూడడుగులు ఖాళీ వదిలితే మరీ మంచిది.

ఈ విధంగా కట్టిన మెట్ల కింద బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు కట్టడం పరిపాటి. కానీ అలా కట్టకుండా వదిలేయటం మంచిది. అలా కట్టడం వలన ఇంటి స్వరూపంలో తూర్పు ఆగ్నేయం పెరిగి చోరాగ్నిభయాలు ప్రారంభమవుతాయి. అధిక వ్యయం జరిగే అవకాశాలు కూడా వున్నాయి.

మెట్లు దక్షిణాభిముఖంగా ఎక్కి అటు నుండి పశ్చిమానికి తిరిగి, ఉత్తరాభిముఖంగా ఎక్కి బాల్కనీ లోకి ప్రవేశించి ఉచ్ఛస్థానంలో వున్న తూర్పు లేదా తూర్పు ఈశాన్య ద్వారం గుండా పై అంతస్తు ఇంటిలోకి ప్రవేశించాలి.

ఈ మెట్లు ఇంటి గోడని అనుకొనిగానీ, అనుకోకుండాగానీ వుండవచ్చు. అనుకొని కట్టడం వలన స్థలం వృథా కాదు. మెట్లు మలుపు తిరిగేచోట ఏర్పడే లాండింగ్(ఎల్) ఇంటి దక్షిణ గోడకు పారుగా వుండాలిగానీ దక్షిణ కాంపౌండు గోడను అనుకొని వుండకపోవటం మంచిది.

నిడివితోగానీ పోర్టికో నిర్మాణం జరుపుకోవాల్సి ఉంటుంది. పోర్టికో గ్రౌండ్ ఫ్లోర్ పై కప్పుకంటే కిందికి వుంటుంది.

ఇంటికీ, దక్షిణ కాంపౌండు గోడకూ మధ్య ఎక్కువ ఖాళీ స్థలం వున్నప్పుడు దక్షిణ ఆగ్నేయంలో మెట్ల నిర్మాణం వీలవుతుంది. సాధారణంగా పశ్చిమంలో వీలు కాక దక్షిణం రోడ్డు వున్నప్పుడు పశ్చిమం లేక దక్షిణ సింహద్వార గృహాలు నిర్మించినప్పుడు దక్షిణ ఆగ్నేయంలో ఈ మెట్ల నిర్మాణం అవసరమవుతుంది. కనీసం దక్షిణంలో ఆరు లేక ఏడు అడుగుల ఖాళీ స్థలం ఉండాలి. దక్షిణంలో అంత ఖాళీ స్థలం వదలినప్పుడు ఉత్తరాన అంతకంటే



ఎక్కువ ఖాళీ స్థలం వదిలివేయవలసి ఉంటుంది.

దక్షిణ ఆగ్నేయంలో రెండు వరుసల మెట్ల నిర్మాణం గావించినప్పుడు ఆ మెట్లు

పై విధంగా మెట్ల నిర్మాణం గావించినప్పుడు, మొదటి అంతస్తు దక్షిణ ఆగ్నేయ తలుపుకు ఎదురుగా మెట్ల రెండవ లాండింగ్ ఏర్పడుతుంది. అలా కాకుంటే మెట్లు ఇంటిగోడను ఆనుకోకుండా కనీసం మూడడుగుల ఖాళీ వదిలి కట్టుకొని ఆ మెట్లు బాల్కనీలోకి చేరుకునేలా కట్టుకోవలసి ఉంటుంది.

1) ఎల్: మొదటి లాండింగ్

2) ఎల్: రెండవ లాండింగ్

(రెండవ అంతస్తు మెట్ల కోసం)

బి: బాల్కనీ

1) ఎల్: మొదటి లాండింగ్

2) ఎల్: రెండవ లాండింగ్

దక్షిణాన బాల్కనీ ఏర్పడటం వలన అంతకంటే వెడల్పులో కాస్తయినా ఎక్కువ వుండేలా ఉత్తరాన బాల్కనీ నిర్మాణం జరపాలి. పశ్చిమాన బాల్కనీ వుంటే అంతకంటే వెడల్పులో కాస్తయినా ఎక్కువ వుండేలా తూర్పున బాల్కనీ ఏర్పాటు చేసుకోవాలి.

ఇటువంటి మెట్ల నిర్మాణం జరపటం వలన నాలుగు వైపులా బాల్కనీ కట్టుకోవటానికి వీలు కలుగుతుంది. పై అంతస్తులో ఎక్కువ ఫ్లోర్లు ఉండి ఎక్కువ జనం తిరుగాడే పరిస్థితి వుంటే ఇటువంటి మెట్ల నిర్మాణం జరిపి, బాల్కనీ స్థలం కావలసినంత వదిలిపెట్టి ఆ సౌకర్యాన్ని కలిగించవచ్చు.

(మిగతా వచ్చే వారం..)

# నండూరి వారి 'యెంకి'

ప్రౌఢ ప్రబంధరీతులు, జటిల పదబంధాలతో, ఘన వృత్త బంధురతలతో జన సామాన్యానికి నాటి ఆంధ్ర భాషావధూటి ఆస్వాదించ సాధ్యంకాని మృగతృష్ణగా వున్న రోజులలో, తెలుగునాట 'ఎంకి' ఉద్భవించింది. వాడుక పలుకుబడితో వ్యవహార జీవద్భాషలో ఎంకి-నాయుడు బావల ప్రణయ భావనల పాటలు తెలుగు పండిత, పామర హృదయాలను తన్మయతతో పరవశింపచేసాయి. 1917-1918లో, శతాబ్దం క్రితంనాటి కాలంలో, నండూరి వెంకట సుబ్బారావు యువ విద్యార్థిగా, మద్రాస్‌లో కాలేజీ నుండి ట్రామ్ రైలులో వస్తుండగా 'గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అన్న పల్లవి పల్లవించి, 'ముద్దుల నా యెంకి' తొలి పాటగా పుట్టింది. ఎంకిపాటలు పుస్తక పీఠికలో నండూరి, తన పెత్తల్లి కుమారుడు భావరాజు వెంకట సుబ్బారావుకు అంకితం యిస్తూ నాటి భావ కవితోద్యమ సారధి, బసవరాజు అప్పారావు, అధికార్ల సూర్యనారాయణరావు, పాటిబండ్ల అప్పారావులు మరెందరో కవి పండితుల ప్రోత్సాహాన్ని వివరించారు. కాశీనాథుని నాగేశ్వరరావు ఆంధ్ర పత్రిక, భారతి, సాహితి, అనసూయ, జనరంజని, జ్యోతి, శారద మొదలైన పత్రికలు తెలుగు పస, నుడి, నాదం, రుచి, సొగసు ప్రచారానికి కంకణం కట్టుకున్నారు. పాటలకు అడవి బాపిరాజు బాపు చిత్రాలు సమకూర్చారు. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి 'ఒకటి రెండు మాటలు'లో లలిత, సుకుమార, సౌందర్య, సౌరభ్యాలను వెదజల్లే పూపొదగా ఎంకి పాటలను ప్రశంసించారు. 1925లో తొలి ముద్రణ తర్వాత 1952లో పునర్ముద్రణలో సుమారు 80 పాటలు చోటు చేసుకొన్నాయి. నాటి సాహితీ ప్రపంచంలో ఎంకి పాటలు సృష్టించిన తిరుగుబాటు కొందరు పండిత ప్రకాండులకు గాలిదుమారం కాగా, నవ యువకవులకు ప్రభావ వాయు ప్రసరణమైంది. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు పారుపల్లి రామకృష్ణయ్య ఎంకి పాటలకు స్వరాలు సమకూర్చారు.

**"యెంకి వొంటి పిల్ల లేదోయి లేదోయి**
**యెంకి నా వొంకింక రాదోయి రాదోయి**
**మెళ్లో పూసల పేరు,**
**తల్లో పూవుల సేరు**
**కళ్లెత్తితే సాలు కనకాబిసేకాలు**
**సెక్కిట సిన్నీ మచ్చ**
**సెపితే సాలదు లచ్చ**
**వొక్క నవ్వే యేలు**
**వొజ్జిర వొయిడూరాలు"**




అంటూ ప్రణయ నాయకిగా 'నండూరి' ఎంకిని కళ్లముందు పాటలో అపురూప చిత్రంగా సాక్షాత్కరింపచేస్తారు. నండూరి, అనంత భావుకుడు. అనన్య సామాన్య మృదు హృదయుడు.

**"పూలబాసలు తెలుసు**
**యెంకికీ మల్లె**
**పూల మనసులు తెలుసు యెంకికీ"**
**పూలమొక్కల నీటి**
**జాలుగని నిలుసుండి**
**మానల్లె నన్నుంచి**
**తాను పూవౌనేమో!**

తాను మానుగా ఉంటూ యెంకిని, పూవుగా వికసింపచేసారు.

"ఎన్నెలంతా మేసి ఏరు నెమరేస్తోంది" అనీ, "ఏటి కడుపున దాగి తోట నిదరోయింది" అనగలిగిన కవి హృదయం యెంకి పాటలు రాగానే, రేగిన కవితా పవన దుమారం తెలుగు సాహితీ ఆకాశంలో నింగి, నేల కమ్మేసింది. గ్రాంథికపు సంకెళ్ల తెంచుకొని తెనుగుజనం మాటలు, అందులో మరీ పల్లె పలుకుబడులుగా నవ్య కవిత్వం వెల్లివిరిసింది. పదాల బరువు లేకుండా భావాలు సూటిగా గుండెలలోకి దూసుకుపోయే సరస మాధుర్యంతో యెంకి పాటలు జనాన్ని అలరించాయి. 1920-30లలో విద్యాధికులయిన మేధావులయిన కవులు, పండితులు యెంకి పాటలు గొంతెత్తి గానం చేసి ఉత్తేజం పొందారు. మహా మహోపాధ్యాయ పంచాగ్నులవారు "ఆంధ్ర వాఙ్మయ కల్పశాఖ ప్రసవించిన సర్వాంగ పరిపూర్ణ పరిణతీ విలసిత సితంబులనే దివ్య ప్రసూనరాజంలో యెంకి పాటలను మన శిరస్సున ధరించవచ్చు" అన్నారు. ఎందరో సినీ కవులకు, చిత్రకళాకారులకు 'ఎంకి' ప్రేరణగా ప్రభవించింది.

యెంకి పాటలకు నండూరి మహాకావ్య స్థాయి కల్పించారు. నండూరి జీవించివున్న రోజులలో పత్రికలు, ఆకాశవాణి, యితర మాధ్యమాలు, సంగీత విద్వాంసులు ఆయన పాటల పారిజాతాలు వెల్లివిరిసాయి. యెంకి హృదయం తొలకరి చినుకులతో తెలుగునేల స్వచ్ఛ సుందరంగా కమ్మని వాసనలు విరజిమ్మింది. సుకుమార, సుమధురమైన యెంకి పాటకు నాయుడుబావ శ్రుతి. యెంకి దీపానికి అతడు ప్రమిద. అతడు పుష్పం అయితే ఆమె పరిమళం. శ్రమజీవులయిన ఆ జంట ప్రేమ దాంపత్యాన్ని, నండూరి పాటగా పరిమళింపచేసి నాగరికులను సమ్మోహితపరిచి శాశ్వత కీర్తి పొందారు.

**"జామురేతిరి యేల జడుపు గిడుపూ మాని**
**సెట్టు, పుట్టా దాటి సేనులో నేనుంటే**
**మెల్లంగ వస్తాది నా యెంకి, సల్లంగా**
**వస్తాది నా యెంకి!**
**ఎన్నని సెప్పేది యెంకి ముచ్చట్లు.."**

1959 మే 29న నండూరి తన యెంకి పాటల్ని తెలుగు లోకానికి వదలి కన్ను మూసారు. 'చలం' వంటి కవితా రసజ్ఞుడు తన ప్రేమలేఖలలో, మ్యూజింగ్స్ లో, యెంకి పాటల మాధుర్యాన్ని అనుభవించి వినూత్న అభిరుచులతో తెలుగు సాహిత్యాన్ని మరింత సుమధురం చేసారు. బసవరాజు, దేవులపల్లి, కాశీనాథుని, కోలవెన్ను, అడవి, పారుపల్లి, గంటి, మంచాల, భమిడిపాటి, గిడుగు, మల్లంపల్లి, గురుగంటి, ద్వారం, విశ్వనాథ, శ్రీశ్రీ వంటి తెలుగు సాహితీ సీమలో లబ్ధ ప్రతిష్ఠులైన మహనీయుల సంగీత సాహితీ వ్యాసంగ రచనలలో స్ఫూర్తివంతంగా 'యెంకి' ప్రత్యక్ష, పరోక్షంగా ప్రతిఫలించింది.

**"యెంకెవ్వరని లోక**
**మెపుడైన కదిపితే**
**వెలుగు నీడల వైపు**
**వేలు సూపింతు!"**

అన్నారు తన రవల వెలుగుల కొత్త పాటలో నండూరి.

**- జయసూర్య**